


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 04-10-2017 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 21 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## భీమిలి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధిచేయాలి

- చిల్లపేట చెరువు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, స్టేడియం, భీమిలి పార్కు భీమిలి బస్‌స్టేషన్, జమ్మిచెరువు జలఉద్యానవనం ప్రాంతాలలో పర్యటన
- సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతాలుగా రూపకల్పన
- రాష్ట్రమానవవనరులశాఖామాత్యులు గంటాశ్రీనివాసరావు



భీమునిపట్నం: భీమిలి ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర మానవవనరులు, విద్యాశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భీమిలిలోని చిల్లపేట చెరువు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం, క్రికెట్ స్టేడియం, భీమిలి పార్కు, బస్‌స్టేషన్, జమ్మి చెరువు జలఉద్యానవనం ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిల్లపేట చెరువును టాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం, స్టేడియం ప్రాంతాలను అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. భీమిలి పార్కును అందంగా తీర్చిదిద్దాలని, జమ్మి చెరువు జల ఉద్యానవనాన్ని సుందరంగా రూపొందించాలని ఆదేశించారు. రహదారులతో బాటు ఒక మంచి పార్కును ఏర్పాటు చేయడం ద్వారా భీమిలిని పర్యటక ఆకర్షణ ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. పోలమాంబ ఆలయ ప్రాంతంలోని పాత భవనాలను కూలగోట్టి జి + 1 గృహాలను నిర్మించాలని పేర్కొన్నారు. భీమిలి గాంధీ పార్కు, పార్కు పరిసరాలను అందంగా తీర్చిదిద్దాలని అందుకు అవసరమైన డి.పి.ఆర్‌ను రూపొందించాలని పేర్కొన్నారు.

జివియంసి కమిషనర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ సృజన, వుడా కార్యదర్శి శ్రీనివాస్, యస్.ఇ వేణుగోపాల్, ఇ.ఇ చక్రవర్తి, జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, గంటా నూకరాజు, ఎంపీపీ యరబాల కృష్ణవేణి, కె. లీలావతి, వివిధ శాఖల అధికారులు , ప్రతినిధులు పర్యటనలో పాల్గోన్నారు.

### దేశాభివృద్ధికి మార్గం

## నదుల అనుసంధానమే

- నదుల పరిరక్షణకు సహకరించాలి
- తెలుగు భాషను తప్పనిసరి చేయాలి
- మాతృభాష కన్ను.. పరభాష కళ్లద్దం
- అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు




విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి తన మనస్సు ఉవ్విళ్లూరుతోందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడాలని తన మనసు కోరుకుంటోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారులు, జల రవాణా ప్రాజెక్టులకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నదులు ఇంకిపోతున్నాయని.. నదుల అనుసంధానం చాలా అవసరమని పేర్కొన్నారు. తరువాయి 2లో



## ఎయిమ్స్ ప్రజలకు జీవనరేఖ

### ఈ రాష్ట్రం కోసం పనిచేయడం అద్భుత అవకాశం

### ప్రధాని నరేంద్ర మోదీ

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌తో తనకు విశేష బాంధవ్యం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రాష్ట్రం కోసం పని చేసే అవకాశం తనకు వస్తే, అదొక అద్భుతంగా భావిస్తానని చెప్పారు. అఖిల భారత వైద్య, విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడికి వచ్చే యాత్రికులు చాలా దూర ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారని, వారికి ఎయిమ్స్, చికిత్సలు తరువాయి 2లో

### అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిన సిరిమానోత్సవం

### విజయనగరం జిల్లా ఎస్పీ జి. పాలరాజు



విజయనగరం: విజయనగరం పట్టణంలో శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సవం కన్నుల పండువగా మంగళవారం సాయంత్రం జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు చర్యలు, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో సత్ఫలతాలనిచ్చింది. సిరిమానోత్సవం ప్రారంభోత్సవానికి ముందే కొన్ని చోట్ల బ్యారికేడ్లు మూసివేయడంతో సిరిమాను తిరిగే ప్రధాన రహదారికి చేరుకునేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లుగా జిల్లా ఎస్పీ దృష్టికి కొంతమంది పాత్రికేయులు తీసుకుని రావడంతో జిల్లా ఎస్పీ జి. పాలరాజు తక్షణమే స్పందించి మూడు లాంతర్లు నుండి కోట జంక్షన్ వరకు కలియ తిరిగి భక్తులు సిరిమాను తిరిగే ప్రాంతానికి చేరే విధంగా బ్యారికేడ్లు నుండి భక్తులను అనుమతించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. సిరిమాను తిరిగే మూడు సార్లు ఎస్పీ కూడా తరువాయి 2లో

## ఈ నెల 9న విశాఖ నగరానికి రానున్న ముఖ్యమంత్రి

### విశాఖలో జరుగు బ్లాక్‌చైన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం



విశాఖపట్నంః ఈ నెల అక్టోబర్ 9, 10 తేదీలలో విశాఖ నగరంలోని నోవోటెల్ హొటల్‌నందు బ్లాక్ చైన్ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారుడు జెఎ చౌదరితో మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశపు ఏర్పాట్లు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. ప్రాథమిక సమాచారం మేరకు ముఖ్యమంత్రి 9వ తేదీ ఉదయం 8.10 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుని నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొని తిరిగి 12 గం. 45 ని.లకు విజయవాడ వెళ్తారు. నోవోటెల్‌లో జరుగు తరువాయి 2లో

### ఉత్తర, దక్షిణ భారతాలను కలపాలంటే ఏపీ కీలకం

ఏపీ అభివృద్ధికి కేంద్రం చేయూతనివ్వాలి
మొదటి ప్రాజెక్టుగా ముక్త్యాల-విజయవాడ
గడ్కరీని సత్కరించిన సీఎం బాబు



అమరావతి : కార్యక్రమంలో పాల్గొన్న సీఎం తరువాయి 2లో




### టేకిట్ ఈజీ




హాలిడేస్ అయ్యాయి... త్వరగా ఫ్రెషప్ అవ్వండి!
అసలే అంతా ట్రాఫిక్ జామ్ !!

## ఎస్సీల అభివృద్ధికి రూ. 2,713 కోట్లు మంజూరు

### ఏపీ స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ అధ్యక్షుడు జూపూడి



అమరావతిః రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో 2,713 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్.సి. కార్పొరేషన్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం గుంటూరుకు విచ్చేసిన ఆయన ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై స్దానిక ఎస్.సి. కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుల వారి కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సమీక్షించారు.

అనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అధ్యక్షులు శ్రీ ప్రభాకరరావు, రాష్ట్రంలోని ఎస్.సి.ల అభివృద్ధి, సంక్షేమం కోసం కార్పొరేషన్ చేపడుతున్న తరువాయి 2లో

# స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలి



విజయవాడ : న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారితో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సభాపతి డాక్టరు కోడెల శివప్రసాదరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో రూ.2కోట్లతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని డీజీపీ నండూరి సాంబశివరావుతో కలిసి సభాపతి ప్రారంభించారు. గ్రామీణ ఎస్పీ అప్పలనాయుడు అధ్యక్షత వహించిన సభలో సభాపతి మాట్లాడుతూ సోషల్ మీడియాతో సైబర్ నేరాలు పెరిగాయని వీటిని అరికట్టేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే పారిశ్రామికవేతలు ఇక్కడకు ధైర్యంగా వస్తారని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమించే పోలీసులపై తనకు గౌరవంతో పాటు సానుభూతి ఉందన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలను సాదరంగా ఆహ్వానించి సమస్య పరిష్కరించాలని కోరారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. డీజీపీ నండూరి సాంబశివరావు మాట్లాడుతూ ఇబ్బందులకు గురై స్టేషన్లకు వచ్చే సామాన్యులకు సత్వర న్యాయం అందించాలని చెప్పారు. తమ పిల్లలతో తల్లిదండ్రులు స్నేహభావంతో వ్యవహరించి వారి ప్రవర్తనను అన్నివేళలా గమనించాలన్నారు. యువతకు సోషల్ మీడియానే లోకం అయిందని ఇది ఎంతో ప్రమాదకరమైన పరిణామమని చెప్పారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ నరసరావుపేటలో మహిళా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో మహిళా పోలీసుల సంఖ్య పెంచాలని కోరారు. నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలతో పాటు కోటప్పకొండను సభాపతి అభివృద్ధి చేసి అందరికీ మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. అనంతరం సభాపతి, డీజీపీలను ఘనంగా సత్కరించారు. తొలుత స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, అర్బన్ ఎస్పీ విజయరావు, అడిషనల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్, మున్సిపల్ ఛైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు మాట్లాడారు. డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐలు వీరయ్య, సాంబశివరావు, ప్రభాకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాటకోత్సవం... నవరసావిష్కారం..!

## - భేషుగ్గా... షరాయి కీ మాలికన్, ఎ ఉమెన్ ఎలోన్, ప్రాబ్లమ్ నాటికలు



విశాఖపట్నం : నాటికలు నవరసావిష్కారం చేశాయి. 'రసజ్ఞ' జాతీయ నాటకోత్సవం రంగస్థల ప్రదర్శనకు నవీన భాష్యం చెబుతోంది.

భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ,ఆంధ్ర విశ్వ విద్యాలయం సహకారంతో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వేమలి త్రినాధరావు కళాభారతిలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల నాటకోత్సవం ప్రేక్షకుల్ని అయస్కాంత క్షేత్రంలా ఆకర్షిస్తోంది. రెండో రోజైన మంగళవారం రాత్రి ఉర్దూ, హిందీ, తెలుగు భాషల్లో మూడు బృందాలు వైవిధ్యమైన నాటికలు ప్రదర్శించి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధం చేశాయి. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, ఆదాయపన్నుల శాఖ సహాయ కమిషనర్ సౌమ్యా పాండే, ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతి సతీమణి రాజారపు విజయ కుమారి తదితరులు లాంఛనంగా జ్యోతి వెలిగించి రెండో రోజు ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. అనంతరం మూడు ప్రదర్శనలు ప్రేక్షకుల్ని తమ సీట్లకు అతుక్కుపోయేట్టు చేశాయి. ప్రదర్శనలకు ముందుగా పి. రాజేంద్ర ప్రసాద్ అలవోకగా మూడు భాషల్లోనూ చేసిన వ్యాఖ్యానం ఆసక్తికరంగా సాగింది.

పాబ్లమ్(తెలుగు): నటులే రచయితలై డాక్టర్ మహ్మద్ ఆల్తాఫ్ హస్సన్ దర్శకత్వం వహించిన 'ప్రాబ్లమ్' నాటిక నేటి సమాజానికి అత్యవసరమైన పాజిటివ్ దృక్కోణం మంచి మోతాదులో అందించింది.ప్రతి మనిషికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. చాలా వరకూ సమస్యలు మన ప్రమేయంతోనే జీవితంలోకి ప్రవేశిస్తాయి. కష్టాలున్నాయని వాటిని తల్చుకుని కుమిలిపోవడం కంటే, అవి మన జీవితంలో ఒక భాగం అనుకుంటూ ముందుకు సాగిపోతే సమస్యలు వాటంతట అవే పరిష్కారమౌతాయనే సందేశం ఇందులో ఉంది. సమస్యను సాధనంగా మలచుకొని జీవితంలో ముందుకెళ్లాలనే సందేశం బావుంది. ఇందులో (ఎ) పాత్రలో సురభి సంతోష్ ,(బి) పాత్రలో అంజి, (సి) పాత్రలో శ్రీను లీనమై నటించారు. నాలుగో పాత్రను (స్పాట్‌లైట్) కథను కీలక మలుపు తిప్పుతుంది. ఈ పాత్రకు లక్ష్మీ కిరణ్ గాత్రదానం చేశారు. ప్రమోద్ కుమార్ సంగీత సహకారమందించారు.



దొండపర్తి వద్ద గల శ్రీసూర్య జంక్షన్ వద్ద గల పరదేశమ్మ ఆలయం వద్ద 15, 31, 44వ వార్డులలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ కలుసుకని వార్డులలో ప్రజల కష్టాలను తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు ప్రెసిడెంట్ అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, కోటేశ్వర రెడ్డి, సింహాచలం జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.



నిరుపేద విద్యార్థిని శోభనకు ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ విద్య నిమిత్తం చదువుకునేందుకు సీఆర్‌పీఎఫ్ బృందం తనవంతుగా ఆర్థిక సహాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం, త్రినాథ్, సత్య కుమార్, శకుంతల, జివి కుమార్, ఎల్లయ్య, బిఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాతపద్ధతిలోనే కొనుగోళ్లు నిర్వహించాలి



మిర్చియార్డు : ఈ-నామ్ అమలు చేసేందుకు గుంటూరు మిర్చియార్డులో మౌలిక సదుపాయాలు కల్పించే వరకు పాతపద్ధతిలోనే కొనుగోళ్లు నిర్వహించేలా అనుమతి ఇవ్వాలని చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కిలారి రోశయ్య కోరారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మిర్చియార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావులను పలువురు మిర్చి వ్యాపారులు కలిసి వినతిపత్రం అందజేశారు. నెల రోజులుగా మిర్చి కొనుగోళ్లు నిలిచిపోవడం వల్ల చిన్న వ్యాపారులు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ-నామ్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే ఈ విధానం ద్వారా కొనుగోళ్లు జరిపిం చేందుకు మిర్చియార్డులో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అప్పటి వరకు పాత పద్ధతిలో ఈ-మార్కెటింగ్ ద్వారా కొనుగోళ్లు నిర్వహిస్తామన్నారు. సింగిల్ బిడ్డింగ్ ద్వారా క్రయవిక్రయాలు జరిగేలా మార్కెటింగ్ కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌కు ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. ఈ-నామ్ అమల్లోకి వచ్చాక నెల రోజులు పాటు కొనుగోళ్లు నిలిచిపోవడం వల్ల సుమారు రూ.300 కోట్లు లావాదేవీలు నిలిచిపోయాయని వెల్లడించారు.

కొందరు తమ స్వలాభం కోసం లావాదేవీలు జరగకుండా అడ్డుపడ్డారని, తాము ఆ విధంగా కాకుండా సహకరిస్తామన్నారు. దీనికి మంత్రి పుల్లారావు స్పందిస్తూ మార్కెటింగ్ కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వ్యాపారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. రైతుల నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టుకుని ఆన్‌లైన్‌లో నగదు జమ చేయాలని వ్యాపారులకు సూచించారు. మౌలిక సదుపాయాలు ఏర్పడే వరకు పాతపద్ధతిలో జరిపేలా సాధ్యా సాధ్యాలను పరిశీలించాలన్నారు. మిర్చియార్డు ఛైర్మన్ మన్నవ మాట్లాడుతూ కమీషన్ ఏజెంట్ల వ్యవస్థను రద్దు చేయబోమని, అసత్య ప్రచారాన్ని వ్యాపారులు నమ్మొద్దని సూచించారు.

కార్యక్రమంలో మిర్చి వ్యాపారులు నాగం శ్రీను, రుద్రాణి దుర్గ, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, కిశోర్ రెడ్డి, అబ్బాస్, తోట వెంకటేశ్వరరావు, కాపలా యూనియన్, ముఠా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పట్టాభిరాముడికి పవిత్రోత్సవాలు

వాల్మీకిపురం : తితిదే ఆధ్వర్యంలోని స్థానిక ప్రాచీన శ్రీపట్టాభిరాముల వారి ఆలయంలో వార్షిక శ్రీపట్టాభిరాముడి పవిత్సోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్స వాలకు ఇప్పటికే తితిదే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పవిత్రోత్సవాలలో పాల్గొనే దంపతులు రూ.300 ఆర్జితసేవ రుసుం చెల్లించి పాల్గొనే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏడాదిలో స్వామివారికి జరిగే నిత్య, పక్ష, వార్షిక ఉత్సవాలలో జరిగే తప్పొప్పులను, తెలిసీతెలియక చేసిన పొరపాట్లను సరిదిద్దే క్రమంలో ఏటా ఈ పవిత్రోత్సవాలను నాలుగురోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 3వ తేదీ సాయంత్రం 6గంటలకు పవిత్రోత్సవాల ప్రారంభ సూచకంగా తితిదే వేదపాఠశాల అర్చకులతో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలను ఆరంభిస్తారు. 4వ తేదీ ఉదయం నిత్యసేవలతో కార్యక్రమాలు ప్రారంభమై ఉదయం 9 గంటలకు పవిత్రప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలోని వూంజల్ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తారు. 5వ తేదీ పవిత్రోత్సవాలలో మూడోరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పవిత్ర సమర్పణ చేసి హోమాలను శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహిస్తారు. 6వ తేదీ చివరిరోజున ఉదయం స్వామివార్లకు స్నపన తిరుమంజన కార్యక్రమం, పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం తిరుచ్చి ఉత్సవంపై స్వామి, అమ్మవార్లు అధిరోహించి వాల్మీకి క్షేత్రంలోని వూరేగుతారు.

మొదటి పేజీ తరువాయి

## దేశాభివృద్ధికి మార్గం నదుల అనుసంధానమే

కృష్ణా-గోదావరి నదులను అనుసంధానం చేసిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. నదులు అనుసంధానమైతే నీటి సమస్య తీరుతుందన్నారు. నదుల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

ఏపీలో తెలుగు భాషను తప్పనిసరి చేయాలని సీఎం చంద్రబాబును వెంకయ్యనాయుడు కోరారు. ఉద్యోగం కావాలంటే తెలుగు వచ్చి ఉండాలన్న నిబంధన పెట్టాలని సూచించారు. తెలుగువాడిని తాను ఉపరాష్ట్రపతిని అయ్యానని.. ప్రధాని మోదీ ఇంగ్లిషు నేర్చుకోలేదని తెలిపారు. ఆంగ్లం, హిందీ నేర్చుకొండి తప్పులేదు.. అయితే మాతృభాషను మరవొద్దని కోరారు. పోలవరం నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలని.. ప్రాజెక్టు పూర్తయిన వెంటనే తాను సందర్శించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎయిమ్స్ ప్రజలకు జీవన రేఖ

అందుబాటులో ఉంటే, వాళ్ళు మళ్ళీ మళ్ళీ వస్తారని అన్నారు. అంతేకాకుండా స్థానికులకు కూడా అనేక ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ ప్రజలకు జీవన రేఖగా మారడంతో పాటు, పర్యాటక రంగానికి కూడా ఊపు వస్తుందని తెలిపారు. 3 వేల మంది కలిసికట్టుగా పని చేసే విధంగా దీనిని తీర్చిదిద్దుతున్నామని, ఉద్యోగావకాశాలు కూడా వస్తాయని చెప్పారు. ఉన అనే చోట ఉన్న ట్రిపుల్ ఐటీ గురించి మాట్లాడుతూ ఇది కేవలం ఒక కళాశాల మాత్రమే కాదని, నూతన శకానికి నాంది అని తెలిపారు. రాష్ట్రంలో 13 అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెడుతోందని వివరించారు.

## ఉత్తర, దక్షిణ భారతాలను కలపాలంటే ఏపీ కీలకం

చంద్రబాబు మాట్లాడుతూ ఈ మహత్తర కార్యక్రమానికి చరిత్రలో శ్రీకారం చుడుతున్నామన్నారు. జాతీయ రహదారిపై ఇంత పెద్దఎత్తున ప్రాజెక్టులు ఎప్పుడూ రాలేదంటూ ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలపాలంటే ఆంధ్రప్రదేశ్ కీలకం అని, ఏపీ వంటి కీలక ప్రాంతానికి కేంద్రం చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. విభజన సమయంలో వెంకయ్య నాయుడు, గడ్కరీ మనకు ఎంతో సాయం అందించారని, రాష్ట్రంలో పుట్టిన వ్యక్తిగా వెంకయ్య రాష్ట్రాభివ ృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారని కితాబు ఇచ్చారు. జాతీయ జల రవాణా మార్గాల్లో మొదటి ప్రాజెక్టు ముక్త్యాల నుంచి విజయవాడ వరకూ నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఏదైనా ప్రాజెక్టు అనుకుంటే అది పూర్తయ్యేవరకు గడ్కరీ- వదిలిపెట్టనన్నారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్‌గా తయారు చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయనని తెలిపారు. కాకినాడ-పాండిచ్చేరి జలరవాణా మార్గం ద్వారా చౌక రవాణాకు ఆస్కారం ఉందని, కాలుష్య రహిత రవాణాకు కూడా వీలు కలుగుతుందని, చెన్నై నుంచి కోల్‌కతా వరకు రవాణాకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, విజయవాడ-అనంతపురం, విశాఖ-రాయపూర్, విజయవాడ ఔటర్ రింగ్ రోడ్లకు కేంద్రం సహకరించాలని కార్యక్రమంలోమ పాల్గొన్న నితిన్ గడ్కరీని చంద్రబాబు కోరారు.

## అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిన సిరిమానోత్సవం

రథాలు వెంబడే ఉండి బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సిరిమానోత్సవం అనంతరం భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో బ్యారికేడ్లను తొలగించి వారు అన్ని మార్గాలలో వెళ్లేందుకు అనుమతించారు. సిరిమానోత్సవం తరువాత ఎక్కువ మంది భక్తులు దేవాలయానికి చేరుకోవడం, అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రయత్నించడం, అదే విధంగా సిరిమాను చెక్కల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఒకేసారి ఎగబాకడం జరిగింది. దీనిని గమనించిన ఎస్పీ జి. పాలరాజు, విశాఖపట్నం రేంజ్ డిఐజి సిహెచ్. శ్రీకాంత్‌లు రోడ్డుకు మధ్యలో రోప్ పార్టీను ఏర్పాటు చేసి మార్గంలో భక్తులు రెండు వైపుల వెళ్లేందుకు తక్షణ చర్యలను స్వయంగా చేపట్టినారు. వృద్ధులు, గర్భిణీలు, అంగవైకల్యం కలిగిన వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసు శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు సేవాదళ్ విశేషమైన సేవలందించి, ప్రజల మన్ననలు పొందింది. సిరిమానోత్సవం అనంతరం ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు ప్రత్యేక చర్యలను పోలీసు శాఖ చేపట్టడం కూడా సత్ఫలితాలనిచ్చింది. సిరిమానోత్సవం సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగియుటకు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారాన్ని పోలీసు శాఖకు అందించారని జిల్లా ఎస్పీ జీ. పాలరాజు అన్నారు.. విద్యుత్, అటవీ, ఆరోగ్య, మునిసిపల్, ఫైర్, రెవెన్యూ, దేవాదాయ మరియు ఇతర శాఖలు సమన్వయంతో పని చేశాయన్నారు. అదే విధంగా ప్రజలు, పాత్రికేయులు తమ వంతు సహకారాన్ని పోలీసు శాఖకు అందించారని, వారందరికీ కృతజ్ఞతలను జిల్లా ఎస్పీ జీ. పాలరాజు తెలిపారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా భక్తులను పోతీఅలసు కంట్రోల్ రూం నుండి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం, మఫ్టీలో పోలీసులు పహారా కాయడంతో ఎటువంటి దొంగతనాలు జరగలేదు. అదే విధంగా తప్పిపోయిన పిల్లలను పోలీసు కంట్రోల్ రూంనకు సమాచారం అందించిన వెంటనే స్పందించి, మిగిలిన పోలీసులకు అప్రమత్తం చేయడం, లౌడు స్పీకర్లతో సమాచారం అందించడంతో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని జిల్లా ఎస్పీ జి. పాలరాజు తెలిపారు.

## ఈ నెల 9న విశాఖ నగరానికి రానున్న ముఖ్యమంత్రి

కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేస్తారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఐ.టి. శాఖ మంత్రి నారా లోకేష్, సుమారు 400 మంది జాతీయ అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఎపిఐఐసి అదనపు ఇడి మహేశ్వర రెడ్డి, అమరావతి నుండి ఐటి శాఖ ప్రతినిదులు రిచా శ్రీవాత్సవ, అనీషా, మహ్మద్ సలీమ్‌లు పాల్గొన్నారు.

## ఎస్సీల అభివృద్ధికి రూ. 2,713 కోట్లు మంజూరు

వివిధ పథకాలు, కార్యక్రమాలపై మీడియాకు వివరించారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కుటుంబాలు కలిగి కోటి జనాభా గల ఎస్.సి.లకు కేటాయించిన బడ్జెట్ ద్వారా వివిధ పథకాల ఫలాలు చేరనున్నాయని చెప్పారు. ఈ బడ్జెట్ లో గుంటూరు జిల్లాకు 308 కోట్ల రూపాయలు కేటాయించబడినట్లు తెలిపారు. సుమారు 15 వేల మంది లబ్ది పొందనున్నట్లు చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువున వున్న ప్రతి కుటుంబాన్ని దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా అమలుచేస్తున్న పథకాల ఫలాలు లబ్దిదారులకు చేర్చేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించెందుకై ప్రతి జిల్లాలో వున్న కార్పొరేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో సిబ్బందికి తగిన శిక్షణను ఈయడం ద్వారా దళారుల వ్యవస్థను అరికట్టగలమని అన్నారు.

భారత రాజ్యంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 125 వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో అమరావతి రాజధానిలో సుమారు రూ.100 కోట్లతో డా.అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం నిర్మాణం కానున్నట్లు తెలిపారు. అంతే కాకుండా అర్హత కలిగిన 125 మందికి 125 ఇన్నోవా కార్లను అందించామన్నారు.

ఈ సంవత్సరం 500 ట్రాక్టర్లను, 200 ఇన్నోవా కార్లను, 200 జే.సి.బి. లను, ప్రొక్లైనేర్లతో పాటుగా బ్యాటరీ తో నడిచే 5,000 వాహనాలను అందించేందుకు లబ్దిదారులు గుర్తించే ప్రక్రియ మొదలైందని అన్నారు. అర్హత గల కుటుంబాలకు భూమి కొనుగోలు పథకం కింద రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఎస్.సి. కుటుంబాలలో నిరుద్యోగ యువతకు వృతి నైపుణ్యం కల్పించి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్తోన్నారు. ఎస్.సి. ఉప ప్రణాళిక కింద రూ.7,800 కోట్లు కేటాయించడం జరిగిందని, ఈ మొత్తంతో రాష్ట్రంలోని ఎస్.సి. కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్.సి. కార్పొరేషన్ జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు శ్రీ బాలాజీ నాయక్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియా అనలటిక్స్‌పై గీతం వర్క్‌షాప్

సాగర్‌నగర్: సోషల్ మీడియా అనలటిక్స్ అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఆద్వర్యంలో అక్టోబర్ 7వ తేదిన గీతం విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ నారాయణన్ తెలిపారు.

డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులు వివిధ కంపెనీలు, సంస్థల ప్రణాళికలో సోషల్ మీడియాకు గల ప్రాధాన్యతను తెలిపే విధంగా నిపుణుల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. అతి తక్కువ మందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నామని ఈ కారణంగా ఆసక్తి గలవారు ముందుగా తమ పేర్లను రిజిష్టర్ చేయించుకోవలసిందిగా సూచించారు. వివరాల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 9703257803, 0891-2840419.

# వర్సిటీలో ఆటోమేషన్ ప్రక్రియ

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆటోమేషన్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అనుబంధ విభాగం ఐటిఐ లిమిటెడ్ ప్రతినిధులు ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ సమావేశ మందిరంలో ఐటిఐ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు రచన చాబ్ర, రైనా బాత్రాలు వర్సిటీ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమ్యారు. అనంతరం ఆటోమేషన్ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టంలో భాగంగా దీనిని నిర్వహించారు.

కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌ఆచార్య ఎం.ఎస్ ప్రసాద బాబు, ఐక్యూఏసి సమన్వయకర్త ఆచార్య ఎం.ప్రమీల దేవి, స్టాటస్టిక్స్ ఆచార్యులు ఆచార్య కె.శ్రీనివాస రావు, దూరవిద్య కేంద్రం ఆచార్యులు ఆచార్య ఎల్.డి సుధాకర్‌బాబు, డిసిఎంఎస్ ఆచార్య వి.క్రిష్ణ మోహన్, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య కె.వెంకట రావు, ఫైనాన్స్ అధికారి డి.విజయ భారతి, డాక్టర్ బి.వి.ఎస్ అవధాని(పరీక్షల విభాగం)లు పాల్గొన్నారు.

సమావేశంలో భాగంగా ఐటిఐ లిమిటెడ్ ప్రతినిధులు 'స్టూడెంట్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్' 'ఫైనాన్స్ మేనేజ్‌మెంట్', ఆపరేషనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మేనేజ్‌మెంట్' అంశాలను వివరించారు.

## సింహగిరీశునికి
## నిత్యాన్నదానప్రసాదంకు రూ.1 లక్ష విరాళం



సింహాచలం : సింహాద్రినాధునికి విరాళంగా రూ.1,00,000/- లు విజయవాడ, గవర్నర్ పేటకు చెందిన మాగంటి సత్యవతి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఎంవికె ఆచార్యులకు అందించారు. ఆలయ మర్యాదలప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి ప్రసాదాలను అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు , డిడి రూపేణావిరాళం ఇచ్చినా సంబందిత అధికారివద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చినా విరాళాలు స్వామివారికి చెందవు అని ఓప్రకటనలో అధికారులు తెలిపారు. డిపాజిట్ చేసిన మొత్తం నుంచి వచ్చిన వడ్డీతో భక్తులు కోరినరోజు అన్న దానం నిర్వహించటం జరుగుతుంది. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్న 94910 00635 నెంబర్ కు సంప్రదించవచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వారిని సంప్రదించగలరని కార్యనిర్వాహణాకారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్ కోరారు.

### ఈనెల 5న
## వ్యక్తిగత గోప్యత హక్కు.. సమాచార హక్కు సమావేశం

విశాఖపట్నం : 'సమాచార హక్కు.. 12 ఏళ్లు.. విజయాలు.. వ్యక్తిగత గోప్యత హక్కు' అంశంపై పబ్లిక్ ఫోరం, హెల్ప్ టు హెల్ప్ పౌండేషన్, సమాలోచన సంస్థల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నంలోని రామాటాకీస్ ఎదురుగా ఉన్న విశాఖ హేపీ ఫంక్షన్ హాలులో సమావేశం జరుగుతుందని పబ్లిక్ ఫోరం కో-ఆర్డినేటర్ కాంగ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు (న్యూ ఢిల్లీ) హాజరవుతారన్నారు. కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, సమాచార హక్కు కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్ధులంతా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9247 166511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. వ్యక్తిగత సమాచారంపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రాధాన్యత, అక్టోబర్ 12 నాటికి అమల్లోకి వచ్చి 12 ఏళ్లు పూర్తైన నేపధ్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) తీరుతెన్నులు, విజయాలు తదితర అంశలపై ప్రధానంగా సమావేశంలో చర్చ జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో ఆయన కోరారు.

### అన్ని ప్రాంతాలకు వెలుగులు నింపడమే
## ఆర్‌ఇసిఎస్ వారి ధ్యేయం
### ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి



శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు, ఆర్‌ఇసిఎస్ ఛైర్మన్ అప్పారావు

సబ్బవరం: అన్ని ప్రాంతాలకు వెలుగులు నింపడమే ఆర్‌ఇసిఎస్ వారి ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన కొత్త రోడ్డు నుండి పాత రోడ్డు వరకు 19 లక్షల 50వేల రూపాయల నిధులతో ఎల్‌ఇడి విద్యుత్ వెలుగులను ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోన అన్ని ప్రాంతాలకు వెలుగులు నింపడమే ఆర్‌ఇసిఎస్ వారి ధ్యేయమన్నారు. ఈ వెలుగులు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు అని అన్నారు. అనంతరం ఆర్‌ఇసిఎస్ ఛైర్మన్ కొటాన అప్పారావు మాట్లాడుతూ ఎల్‌ఇడి బల్బులతో విద్యుత్ ఆదా చేసుకోవచ్చని, సబ్బవరం పరిసర ప్రాంతాలకు కూడా విద్యుత్ వెలుగులు త్వరలో ఇస్తామని అన్నారు. లోవోల్టేజ్ సమస్యను కూడా తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మినాయుడు, గండి దేముడు, జెడ్పీటీసీ గేదెల సత్య నారాయణ, శరగడం శంకర్‌రావు, దొడ్డి ప్రకాష్, కె.గడ్డిప్పా, గవర అప్పారావు, మడ్డు సూర్య నారాయణ, పోతల కనకరాజు, రెడ్డి దేముడు బాబు, పల్లా తాతారావు, గ్రామ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనువాసరావు, ఆకుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## యలమంచిలికి స్వచ్ఛభారత్ పురస్కారం

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి స్వచ్ఛభారత్ పురస్కారం లభించిందని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ మేరకు గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన మున్సి పాలిటీకి రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కడం ఇది రెండోసారన్నారు. గత ఏడాది బహిరంగ మల విసర్జన రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్ది నందుకు రాష్ట్ర స్థాయి ఓడిఎఫ్ మున్సి పాలిటీగా అవార్డును దక్కించుకున్నామన్నారు. అందరి మన్ననలు పొందిందన్నారు.

## సింహగిరీశుని దర్శించుకున్న మాజీ దేవాదాయ ధర్మాదాయ శాఖా కమిషనర్



సింహాచలం : సింహాద్రిపై కొలువై ఉన్న వరహాలక్ష్మీనృసింహ స్వామివారిని మాజీ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ పడమటి సుందర్ కుమార్ దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎంవికె ఆచార్యులు పూలమాలవేసి ఘన్నస్వాగతం పలికారు. అర్చకస్వాములు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. ముందుగా ఆయన కప్పస్థంభం ఆలింగనం చేసుకున్నారు. తరువాత వేదనదాల నడుమ బేడా చుట్టూ ప్రదక్షణ చేసి స్వామివారికి తమగోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వ చనం పలికారు. తరువాత సహాయ కార్యనిర్వహణాధికారి స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### అనువాద సాహిత్యం
## ఆంగ్లం సిలబస్‌లో చేర్చాలి

విశాఖపట్నం : ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువదించి ఆంగ్ల సిలబస్‌లో చేర్చాలని ప్రయుఖ రచయిత డాక్టర్ బి.వి రాధాకృష్ణ అన్నారు. ఏయూ జర్నలిజం విభాగ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ఎడాప్టింగ్ కన్యాశుల్కం ఇంగ్లీష్ వెర్షన్ ఇంటూ లాంగ్వేజ్ క్లాసెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల సిలబస్‌లో అనువాద సాహిత్యాన్ని చేర్చడం వలన సాంస్కృతిక, భావోద్వేగ సంబంధాలు మెరుగవుతాయన్నారు.


విదేశీ భాషల అధ్యయన విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్ మూర్తి మాట్లాడుతూ కన్యాశుల్కం ఆంగ్ల అనువాద పుస్తకం ఓలేను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక కట్టుబాట్లు, ఆచారాలను తెలియజేసే చారిత్రక ప్రాధాన్యం కలిగిన నాటకంగా కన్యాశుల్కం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌స్కిల్స్ శిక్షకుడు చల్లా క్రిష్ణవీర్ అభిషేక్, విశ్రాంత అధ్యాపకులు కనక లింగేశ్వర రావు, అన్వర్‌షేక్ తదితరులు ప్రసంగించారు.

## ఇది రోడ్డా, పొలమా?



అరకులోయ: మండలంలో సిఎంహెచ్ స్కూల్ కాలనీ నుండి శారదా నికేతన్ స్కూల్‌కి వెళ్ళే దారి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిత్తడిగా వున్న దారిలో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. కోలనీలో పాఠశాల ఉండడంతో విద్యను అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు ఉన్నప్పటికీ కూడా లేని పరిస్థితిలో ఇబ్బంది పడుతున్నామని ఈ ప్రాంత ప్రజలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఏకేసి కాలనీ వాసులకు
### హెచ్‌పిసియల్ విశాఖ పోర్టు ట్రస్టు అధికారులకు స్వల్ప వివాదం
### -మరుగుదొడ్డి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని విడిచి పెట్టాలని వినతి



సింథియా: జీవీయంసీ 45వ వార్డు ఏకేసీ కాలనీలో కాలనీవాసులకు హెచ్‌పిసియల్, విశాఖ పోర్టు ట్రస్టు అధికారులకు స్థలం విషయమై మంగళవారం స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో కాలనీ వాసులు ఆందోళన బాట పట్టారు. ఇందుకు సంబందించిన వివరాలను కాలనీ వాసులు, వైకాపా వార్డు అధ్యక్షులు గుండపు నాగేశ్వరరావులు తెలుపుతూ....... గతంలో అగ్నిప్రమాదం జరిగిన అనంతరం ఏకెసి కాలనీ నివాసితులకు కాలనీ చివరలోనున్న 100గజాల స్థలం మరుగు దొడ్డి నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందని, వాటి నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే మళ్ళా విజయప్రసాద్ కూడా దానికి అనుమతి మంజూరు చేయడం జరిగిందని వార్డు వైకాపా అధ్యక్షులు గుండపు నాగేశ్వరరావు తెలిపారు. అయితే అధికారులు ఆకస్మిఖంగా వచ్చి కాలనీ వాసులపై జులుం ప్రదర్శిస్తూ, ఆ స్థలాన్ని తమదంటూ ఆక్రమించుకొని దాని చూట్టూ ప్రహరీగోడను నిర్మాణం చేయడానికి అధికారులు పనులు ప్రారంభించడం దారుణమని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేసారు. తమ కాలనీ వాసులకు మరుగు దొడ్డి లేక పోవడం వలన చాలా ఇబ్బందులను ఏదుర్కోనడం జరుగుతుందని ఈ విషయాన్ని జీవీయంసీ, స్థానిక ఎమ్మెల్యే పి. గణబాబు దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగిందని తెలిపారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది కల్గించకుండా ఆ స్థలాన్ని మరుగు దొడ్డి నిర్మాణం కోసం విడిచి పెట్టాలని, తక్షణమే మరుగు దొడ్డి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసారు. హెచ్‌పిసియల్ అధికారులు, పోర్టు అధికారులు కాలనీ వాసుల ఇబ్బందును పరిగణలోనికి తీసుకొని, స్థలం పై ఎటువంటి నిర్మాణాలను చేయకుండా చర్యలు తీసుకోవాలని, లేని యెడల ఆందోళనను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గణబాబు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వర్సిటీలో దుర్గా పూజలు
### పూజా కార్యక్రమంలో పాల్గొన్న వీసీ నాగేశ్వర రావు

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పలు విభాగాలలో బుధవారం దుర్గాపూజలు నిర్వహించారు. ఉదయం ఏయూ పరీక్షల విభాగంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావులు పాల్గొన్ని పూజలు జరిపారు. వర్సిటీ ఉద్యోగులకు, విద్యార్థులకు శుభం కలగాలని కోరుతూ పూజలు జరిపారు. ప్రతీ సంవత్సరం పరీక్షల విభాగంలో దుర్గా పూజలు జరపడం పట్ల ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం డీన్ ఆచార్య చంద్రమౌళి, అవధాని, పరీక్షల విభాగం అధికారులు, ఏఆర్‌లు, డిఆర్‌లు తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో దుర్గాపూజను జరిపారు. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



**39వవార్డు భవన నిర్మాణ కార్మిక సంఘము ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సనపల చంద్రమౌళికి సన్మానము గావించారు. దీనికి భవన నిర్మాణ కార్మిక సంఘము అధ్యక్షులు గోపాలము, ప్రధాన కార్యదర్శి పప్పల లక్ష్మణరావు, సభ్యులు త్రినాథ్, రమణ, నారాయణరావు, ఎన్ని దామోదర రావు, వావిలపల్లి ఎరుకయ్య, పైడినాయుడు, భాస్కరరావు, శ్యామలరావు, అప్పలనాయుడు, వాసు, సిపన ముకుంద, మల్లిష్, తవిటి నాయుడు నరసింగరావు, అన్నాజీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.**

## ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో మరణించిన శిశువుపై డా.మెహర్‌కుమార్ వివరణ

విశాఖపట్నం: ఇటీవల అక్టోబర్ 1వతేదీ ఆదివారం ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి (ఘోషాసుపత్రి) లో శిశు మరణంపై ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డా.మెహర్‌కుమార్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. వెంకోజిపాలెంకు చెందిన సి.హెచ్.అన్నపూర్ణ (25 సంవత్సరాలు) సెప్టెంబర్ 22న డెలివరీ నిమిత్తం విక్టోరియా ఆసుపత్రిలో జాయినఎ అయ్యారని, అప్పటికే ఆమె అధిక రక్తపోటు, చక్కెర వ్యాధితో బాధ పడుతున్నదని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మగబిడ్డను ప్రసవించిందని, బిడ్డ పుట్టుకతోనే చనిపోయిందని వైద్యులు ధృవీకరించారని ఆయన తెలిపారు.

ఈ ఒక్క కేసు తప్పితే గత వారం రోజులుగా ఆసుపత్రిలో ఎటువంటి మరణాలు సంభవించలేదని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం బాలింతరాలైన అన్నపూర్ణకు కెజిహెచ్‌లో వైద్య సేవలు అందించడం జరుగుతున్నదని, ఆమె కోలుకుంటున్నదని ఆయన తెలిపారు.

## రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు కిమిడి కళావెంకటరావుకు ఘన స్వాగతం




గాజువాక: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా రెండవ సారి ఎన్నికైన కిమిడి కళా వెంకటరావుకు గాజువాక తెదేపా శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం కొత్తగాజువాక కూడలి నుంచి తెదేపా సీనియర్ నాయకులు దొడ్డిరమణ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు కళావెంకటరావుకు పూల దండలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ తెదేపా తనను నమ్మి రెండొవసారి అధ్యక్షులుగా ఎన్నికున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకు కృతజ్ఞతలని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం తనకు పార్టీ కల్పించినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు పాతర్లగడ్డ రంగబాబు, పుఛ్చా విజయకుమార్, విళ్ళా రాం మోహన్ కుమార్, జయరాజ్, మంత్రి మంజులు తది తరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం
### వైద్యాధికారిని పి.హేమలత




అచ్యుతాపురం: క్యాన్సర్ వ్యాదుల పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాదికారిని పి.హేమలత అన్నారు. మంగళ వారం స్థానిక ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాస్టర్ మహిళ హెల్త్ చెకప్ ద్వారా క్యాన్సర్ వ్యాదిని ముందుగానే గుర్తించి వచ్చున్నారు. మహిళలే ఎక్కువ శాతం క్యాన్సర్ వ్యాది బారిన పడుతున్నారని, 35 సంవత్సరాలు దాటిన మహిళలలో ఎక్కువ శాతం ఈ వ్యాది బారిన పడుతున్నారన్నారు. క్యాన్సర్‌లో చాతీ క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వారం వద్ద వచ్చే క్యాన్సర్‌లు ఉన్నాయన్నారు. ఈ వ్యాదులకు సంభందించిన లక్షణాలను ముందుగా గుర్తించి సంభందిత వైద్యుడ్ని సంప్రదిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

అనంతరం పిహెచ్‌సిలో జరిగిన సమావేశంలో వైద్యాదికారిని నీలిమా ప్రసూజా మాట్లాడుతూ సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఈ సమావేశంలో సిహెచ్ఒ పి.సాంబమూర్తి, పిహెచ్ఎన్ గ్రేస్, హెల్త్ అసిస్టెంట్ లండా అప్పలకొండ, అప్పారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

### బాలురతో సమానంగా బాలికలు

భారతీయ బాలికలు బాలురకు సమానంగా విద్యాభివృద్ధి సాధించడం అబ్బురపరుస్తున్నది. ఎన్నో దశాబ్దాలుగా తీరని ఆకాంక్షగా ఉన్న బాలికా విద్య ఇప్పుడు వాస్తవం కాబోతున్నది. దేశంలోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో బాలికల శాతం 48కి చేరుకున్నదని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నివేదిక తెలియజేయటం సంతోషదాయకం. ఇది దేశాభివృద్ధిలో విప్లవాత్మక పరిణామం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే కాలానికి అక్షరాస్యతలో దేశం దయనీయస్థితిలో ఉండేది. ఇక మహిళా అక్షరాస్యత గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నాడు మహిళల్లో అక్షరాస్యత మూడు నాలుగు శాతం కన్నా ఎక్కువ లేదు. అలాంటి సామాజిక స్థితి నుంచి నేడు బాలికలు అక్షరాస్యతలో సమానస్థాయికి చేరుకున్నారు. డిగ్రీ, పీజీ చదువుల్లో బాలుర కన్నా బాలికల శాతమే ఎక్కువగా ఉంటున్నదని ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సాధించిన గొప్ప ఫలితమనేది అంగీకరించక తప్పదు. దేశం ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళికతో కార్యక్రమాలు రూపొందించి అమలుచేయటం ద్వారా అద్భుత ఫలితం సాధించగలిగాం.

బాలికలకు అవకాశాలను అందుబాటులో ఉంచటంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) కూడా కొనియాడింది. అలాగే యువ త స్థితి మెరుగుపరిచే విధానాల అమలులో భారత్ ఒక ఉదాహరణ అని ది స్టేట్ ఆఫ్ పాపులేషన్-2016 తన నివేదికలో శ్లాఘించటం మన నిబద్ధతకు నిదర్శనం. బాలికలు విద్యావంతులు కావడానికి అనేక అవరోధాలు ఉన్నాయి. అనేకానేక సామాజికార్థిక అంశాలతో పాటు, మూఢాచారాలు కూడా కారణం. ఆడపిల్లలు గడప దాటడమే తప్పని భావించే కాలాన్ని దాటి ఎంతో దూరం వచ్చాం. ఆడపిల్లలు చదువులతో ఊర్లు ఏలేదుందా, రాజ్యాలు పాలించేది ఉందా, ఓ ఇంటికి సాగనంపడమే కనుక, చదువుల కోసం ఖర్చు చేసుడెందు కు అనే దురభిప్రాయాలు ఉండేవి. ఒకే ఇంట్లో ఆడ, మగ శిశువుల మధ్య వ్యత్యాసం కొనసాగిం ది. ఇలాంటి సామాజిక పరిస్థితుల్లోంచి బాలికా విద్య విషయంలో ప్రభుత్వాలు పట్టువిడువకుండా చేసిన ప్రయత్నాలు, ప్రచార కార్యక్రమాలు పోషించిన పాత్ర అద్వితీయమైనది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1988నుంచి జాతీయ అక్షరాస్యతా కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇది కొనసాగుతుండగానే 2000 సంవత్సరంలో సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామస్థాయి నుంచి బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండేట్లు చర్యలు తీసుకున్నారు. గత ముప్ఫై ఐదేండ్ల కాలంలో 64కోట్ల మంది చదువటం, రాయటం నేర్చుకున్నారు. గతంతో పోలిస్తే అక్షరాస్యత రెట్టింపయ్యింది. యునెస్కో గణాంకాల ప్రకారమే 1981లో 29.3 కోట్లమంది అక్షరాస్యులుంటే, అది 2015 నాటికి 93.1 కోట్లకు చేరుకున్నది. మొత్తంగా అక్షరాస్యత పెంచటం కోసం కార్యక్రమాలు రూపొందిస్తూనే, బాలికా విద్యకోసం ప్రత్యేక కృషిచేశారు. ముఖ్యంగా 1990 దశకం నుంచి దేశంలో వచ్చిన విప్లవాత్మక పరిణామాలు కూడా మహిళా సాధికారతకు ఊతమిచ్చాయి. మహిళలు పురుషులతో సమానస్థాయిలో ఉద్యోగాల నిర్వహణలో రాణించి, ఆ పదవులకే వన్నె తెచ్చారు. ఒకానొక దశలో బడా కార్పొరేట్ కంపెనీలు సైతం మహిళా ఉద్యోగుల వైపే చూసే స్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యతపై, ముఖ్యంగా బాలికా సంక్షేమంపై ప్రత్యేక కృషి చేస్తున్నది. కేజీ టు పీజీ దాకా ఉచిత విద్యమొదలు, రాష్ట్రంలో ఆసరా పథకం తర్వాత అతిపెద్దది సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ పథకమే. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 31,711 ప్రధాన అంగన్ వాడీ కేంద్రాలు, 3,989 మినీ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా మాతా, శిశువులకు సమగ్ర పౌష్ఠికాహారం అందిస్తూ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభిస్తున్నది. అక్కడినుంచే శిశువుల ఆరోగ్య స్థితిగతులు, ఎదుగుదలను పొందుపర్చే పిల్లల అభివృద్ధి పుస్తకాలను రూపొందించి ప్రతి శిశువు ఆరోగ్యంగా రూపుదిద్దుకునేందుకు కృషి చేస్తున్నది. క్రీడారంగంలో ఉన్నత శ్రేణికి చేరిన సానియా, సైనా వంటి క్రీడాకారిణులను సత్కరించడం ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డలను చూసి తల్లిదండ్రులు గర్వపడాలనే సందేశాన్ని ప్రజలకు అందించారు. దీనివల్ల బాలికలంటే చిన్నచూపు పోయింది. ఆడపిల్ల పుడితే సంతోషించి, చదివిస్తున్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా బాలికల కోసం 500 గురుకులాలు ప్రారంభమయ్యా యి. దేశ చరిత్రలోనే ఇదొక అసాధారణ ఘట్టంగా చెప్పుకోవచ్చు. ఇవన్నీ బాలికా విద్యపట్ల ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా భావించాలి. బాలికల విద్య విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమైనది.

## పోలీసుల ముందు లొంగిపోయిన హనీప్రీత్



చండీగఢ్: రేప్ కేసులో దోషిగా తేలి రోహతక్ జైల్లో ఉన్న డేరా బాబా దత్తపుత్రిక హనీప్రీత్ సింగ్ ఇవాళ పోలీసుల ఎదుట లొంగిపోయింది. మొదట ఆమెను పంజాబ్ పోలీసులు కస్టడీలోకి తీసుకొని తర్వాత హర్యానా పోలీసులకు అప్పగించారు. ఆమెపై దేశ ద్రోహం కేసుతోపాటు డేరా చీఫ్‌ను తప్పించే కుట్రలో పాలుపంచుకున్నదని, హింసను ప్రేరేపించిందని కేసులు పెట్టారు. డేరా బాబాను జైల్లో వేసినప్పటి నుంచే హనీప్రీత్ కోసం కూడా గాలింపు చేపట్టారు. ఆమె మొదట్లో నేపాల్ పారిపోయిందని అనుమానం వ్యక్తంచేశారు. బయటి ప్రపంచానికి ఆమె డేరా బాబా దత్త పుత్రికే అయినా.. ఈ ఇద్దరికీ లైంగిక సంబంధం ఉందని, వాళ్లెప్పుడూ ఒకే గదిలో పడుకునేవారని హనీప్రీత్ మాజీ భర్త విశ్వాస్ గుప్తా ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై ఆమె ఇవాళ స్పందించింది. తనపై వచ్చిన ఆరోపణలు బాధించాయని హనీప్రీత్ చెప్పింది. ఓ తండ్రి ప్రేమగా కూతురిపై చేయి వేయడా అంటూ ఆమె ఎదురు ప్రశ్నించింది. పవిత్రమైన తండ్రీ, కూతుళ్ల బంధం తమ మధ్య ఉందని చెప్పింది. తనపై ఉన్న కేసులకు సంబంధించి యాంటిసిపేటరీ బెయిల్ కోసం ఆమె ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేసినా.. కోర్టు నిరాకరించింది. ఈ కేసులో తన తండ్రిని అనవసరంగా ఇరికించారనడంతోపాటు పంజాబ్, హర్యానా డ్రగ్ మాఫియా నుంచి తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని హనీప్రీత్ పిటిషన్‌లో పేర్కొన్నది.

## రైలు పట్టాలపై సెల్ఫీ.. ముగ్గురు మృతి



బెంగళూరు : సెల్ఫీ సరదా ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలిగొంది. ఈ విషాద ఘటన బెంగళూరుకు సమీపంలోని బిదాబి వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. బిదాబి రైల్వేస్టేషన్‌కు సమీపంలో రైలు వస్తుండగా.. ముగ్గురు విద్యార్థులు కలిసి రైలు పట్టాలపై సెల్ఫీ దిగేందుకు యత్నించారు. సెల్ఫీ మోజులో పడిన విద్యార్థులను అతివేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులు బెంగళూరుని నేషనల్ కళాశాలలో చదువుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుల నివాసాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీనగర్‌లో ఉగ్రదాడి.. ముగ్గురు టెర్రరిస్టుల హతం



శ్రీనగర్: మంగళవారం ఉదయాన్ని శ్రీనగర్ ఉలిక్కి పడింది. ఎయిర్‌పోర్ట్‌కు దగ్గర్లోని బీఎస్ఎఫ్ క్యాంప్‌పై ఉగ్రవాదులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. వాళ్లు జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ముగ్గురిలో తీవ్రంగా గాయపడిన ఓ జవాను.. తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. ముగ్గురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. ఆ క్యాంపస్‌లోనే దాగిన మిగతావారి కోసం భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌ను మూసేశారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ ఈ దాడులకు పాల్పడినట్లు ప్రకటించుకుంది. ఇవాళ ఉదయం 4 గంటల సమయంలో బీఎస్ఎఫ్ 182 బెటాలియన్‌పై ఉగ్రవాదులు దాడులు మొదలుపెట్టారు. వెంటనే తేరుకున్న జవాన్లు ఎదురు దాడికి దిగారు. కౌంటర్ టెర్రరిజం యూనిట్ అయిన 53 రాష్ట్రీయ రైఫిల్స్‌ను రంగంలోకి దింపారు. వీళ్లతోపాటు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఇతర బలగాలు కూడా ఆపరేషన్‌లో పాల్గొన్నారు. క్యాంప్‌లో ఇంకా ఫైరింగ్ కొనసాగుతూనే ఉన్నది. ఉగ్రవాదులో ఓ భవనంలో దాక్కున్నట్లు భద్రతా బలగాలు తెలిపాయి. ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు చెందిన కీలక స్థావరాలు ఉన్నాయి. వీఐపీలతోపాటు ఆర్మీ వాళ్ల కోసం ప్రత్యేక ఎయిర్‌పోర్ట్, గొగొ హమ్‌హమా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ కోసం ఇతర వసతులు ఇక్కడ ఉన్నాయి. దీనికి దగ్గర్లోనే ఉన్న కశ్మీర్ వ్యాలీ స్కూల్‌ను మూసేశారు. ఉదయం 8.30 గంటల తర్వాతే ఈ రూట్‌లో ప్రయాణికులను అనుమతించారు.

## జూబ్లీహిల్స్-పంజాగుట్ట మార్గంలో ప్రయాణించొద్దు

### వాహనదారులకు జీహెచ్ఎంసీ సూచన



హైదరాబాద్ : సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారు లపైకి భారీగా వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, బంజారాహిల్స్, పంజాగుట్ట మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్-పంజాగుట్ట మార్గంలో ప్రయాణించవద్దని వాహనదారులకు జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తుగా సూచిస్తున్నారు. కేబీఆర్ పార్క్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచింది.

మాదాపూర్, గచ్చిబౌలిలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, కాలనీ అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. మాదాపూర్‌లో పలు అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి వరద నీరు చేరి వాహనాలు మునిగిపోయాయి. ఉదయం నుంచి కొండాపూర్, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## కవి సమయం

### గగన కుసుమం

సాక్షిగా వస్తాను
ఈ భువనం నుండి గగనానికి
సామాన్యుడి బతుకుని
కన్నీటి నదిలో
కష్టాల నావపై
పయనింప చేస్తున్న
రాజకీయ నాయకుల చరిత్రలను
వివరించడానికి
సాక్షిగా వస్తాను
విద్య వినయములకు
స్వస్తి చెప్పి
తప్పుదోవ పడుతూ
మత్తు గమ్మత్తులకు
చిత్తు చిత్తుగా
బానిసలవుతున్న
యువతీయువకుల
విలాసాలను
విశదీకరించడానికి
సాక్షిగా వస్తాను..

**ఆకాశం సత్యప్రకాష్**
9985585552

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : చతుర్దశి రా. 12.50
పూర్వాభాద్ర రా. 9.36 వ.ఉ. 7.14ల 8.49

బుధవారం
04-10-2017

**మేషం:** ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. స్త్రీలకు శారీరక రుగ్మతలు, పనివారలతో చికాకులు అధికం. ఉద్యోగస్తులకు అధికారుల తీరు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. వాహనం పిల్లలకు ఇవ్వటం క్షేమం కాదు. మీ ప్రసంగాలు శ్రోతలను ఆకట్టుకుంటాయి. ఊహించని పెద్ద ఖర్చు తగిలే ఆస్కారం ఉంది.

**వృషభం:** ఆర్థిక వ్యవహారాల్లో ఎవరినీ అతిగా విశ్వసించవద్దు. సంగీత, సాహిత్య కళాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. ప్లీడర్లకు తమ క్లయింట్‌లు తీరు ఇబ్బందులకు గురిచేస్తుంది. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించటం వల్ల అస్వస్థతకు లోనవుతారు. స్త్రీలకు టీవీ, కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

**మిథునం:** బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. వివాదాస్పద విషయాల్లో మీ ప్రమేయం లేకుండా జాగ్రత్త వహించండి. ధనం కంటే ఆత్మగౌరవానికే ప్రాధాన్యం ఇస్తారు. ప్రయాణాల్లో కొంత అసౌకర్యం కలిగినా నెమ్మదిగా సమసిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులను ఎదుర్కొంటారు.

**కర్కాటకం:** ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి సమస్యలు తలెత్తుతాయి. జాగ్రత్త వహించండి. మీ సంతానం విపరీత ధోరణి ఆందోళన కలిగిస్తుంది. మీ కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగస్తులు ఇతర వ్యాపకాలు విడనాడి స్థిరచిత్తంతో పని చేయవలసి ఉంటుంది. గత సంఘటనలు అనుక్షణం జ్ఞప్తికి వస్తాయి.

**సింహం:** బ్యాంకు వ్యవహారాలలో ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. వృత్తి వ్యాపారులకు అన్ని విధాలా కలసిరాగలదు. కుటుంబీకుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించవలసి ఉంటుంది. బంధువుల నుండి సమస్యలు తలెత్తుతాయి. విద్యార్థులకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. క్రీడాకారులకు ప్రోత్సాహకరం.

**కన్య:** ఆర్థిక, మానసిక సమస్యలకు చక్కని పరిష్కార మార్గం గోచరిస్తుంది. కలిసి వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటారు. ఉద్యోగ యత్నంలో నిరుద్యోగులకు బిడియం, అభిమానం కూడదు. వృత్తి వ్యాపారులకు అన్న విధాలుగా కలసిరాగలదు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు మంచి స్పందన లభిస్తుంది.

**తుల:** వ్యాపారాభివృద్ధికి చేపట్టిన పథకాలు మంచి ఫలితాలనిస్తాయి. సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మంచి మాటలతో ఎదుటివారిని ప్రసన్నం చేసుకోవటానికి యత్నించండి. కలిసివచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటారు. ఆపత్సమయంలో ఆప్తులు అండగా ఉంటారు.

**వృశ్చికం:** బ్యాంకు వ్యవహారాలలో పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించండి. ఎంతటి విపత్కర పరిస్థితులైనా నిబ్బరంగా ఎదుర్కుంటారు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు మంచి స్పందన లభిస్తుంది. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులెదుర్కుంటారు. ఒక స్థిరాస్తి విక్రయంలో పునరాలోచన మంచిది.


**ధనుస్సు:** ప్లీడర్లకు తమ క్లయింట్‌లు తీరు ఇబ్బందులకు గురిచేస్తుంది. వృత్తి వ్యాపారాల్లో ఆటుపోట్లు, పోటీని దీటుగా ఎదుర్కుంటారు. పలుకుబడి, మంచితనం కలిగిన వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

**మకరం:** బ్యాంకు లోన్లు, పర్మిట్లు మంజూరవుతాయి. బంధువులు మీ నుంచి పెద్ద మొత్తంలో ధన సహాయం ఆర్థిస్తారు. మీ ఉన్నతిని చూసి అసూయపడేవారు అధికమవుతున్నారని గమనించండి. మీ వ్యాపకాలు తగ్గించుకుని కుటుంబ విషయాలపై శ్రద్ధ వహించండి. దూర ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆలయాలను సందర్శిస్తారు.

**కుంభం:** ఎరువులు, మందులు, సుగంధ ద్రవ్య, ఆల్కహాలు వ్యాపారులకు అభివృద్ధి కానవస్తుంది. బ్యాంకు వ్యవహారాలలో చికాకులు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాలు గోప్యంగా ఉంచండి. రాజకీయాల్లో వారికి ప్రత్యర్థుల ద్వారా సమస్యలు ఎదుర్కొనకతప్పదు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి, శ్రమాధిక్యత వంటివి తలెత్తుతాయి.

**మీనం:** వాతావరణంలో మార్పుల వలన వ్యవసాయదారులకు నూతన ఉత్సాహం కానరాగలదు. స్త్రీల వాక్ చాతుర్యానికి మంచి గుర్తింపు లభిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు పురోభివృద్ధి. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు తాత్కాలికమే అయినా సద్వినియోగం చేసుకోవటం మంచిది.

## జ్ఞానామృతం పంచే గురు పౌర్ణమి



**అయితే** ఈ రోజున సన్యాసులంతా వ్యాసుని రూపంలో వున్న తమ గురువుని కొలుస్తున్నారన్న మాట ! వైష్ణవ పురాణం దానం చేస్తే ఆషాఢ పూర్ణిమనాడు విష్ణులోకం పొందుతారుట. వ్యాసుడు సకల కళా నిధి, సకల శాస్త్రవేత్త, శస్త్ర చికిత్సవేది, మేధానిధి, వైద్యవరుడు, ఆత్మవిద్యానిధి, వైద్య విద్యానిధి.ఈ రోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుని తప్పక పూజించాలి.

**శో: శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణం**
**సూత్ర భాష్యవృతా వందే భగవంతౌ పునః పునః**
**అని పఠిస్తే బ్రహ్మత్వసిద్ధి కలుగును!**

**ఆషాఢ పూర్ణిమ ప్రత్యేకతలు**

ఈ రోజు గురు పూర్ణిమతో పాటుగా కోకిలా వ్రతం, మహాషాఢి అని, వ్యాస పూజ, శివశయనోత్సవం, జితేంద్రరాయ జాతర. ఆ, కా, మా, వై పూర్ణిమలో మొదటిదైన ఆషాఢ పూర్ణిమ స్నానం... ఎన్నో వున్నాయి. కోకిలా వ్రతం విచిత్రంగా వుంటుంది, ఈనాడు సాయంకాలం నది స్నానం చేసి తెలకపిండితో కోకిల ప్రతిమ చేసి పూజ చేయాలి.

నెల రోజులు పాటు అమ్మాయిలు, అబ్బాయిలు ఎవరు చేసినా అందమైన భాగస్వామి దొరుకుతాడని అంటారు. కోకిల, తెలకపిండి ప్రధానంగా కావాలి. ఆషాఢంలో తెలకపిండి తీసుకోవాలి, కోకిల వలస వెళ్ళిపోతుంది. కోకిలాదేవి ద్రుపదుని భార్య. (ఈ వ్రత విధానం, కథ అంతా స్మృతి కౌస్తుభంలో చూడచ్చు).

**జితేంద్రరాయ జాతర**

మహబూబ్‌నగర్ జిల్లా వసుమర్తి గ్రామం దగ్గర భీమనది కృష్ణలో సంగమించే చోటున ద్వీపం వుంది. అక్కడ శ్రీ కృష్ణ ద్వైపాయన బృందావనం అనే ఆరామం దగ్గర జితేంద్రరాయ పేరిట అతి ఘనంగా వ్యాస పూర్ణిమ నిర్వహిస్తారు.

**బాసర (బాసర అదిలాబాద్ జిల్లాలో వుంది)**

ఇక్కడ వ్యాస మహర్షి అమ్మవార్ని సైకత శిల్పంగా చేసి సైజలు చేసాడని అంటారు. ఆ కథతో పాటుగా వ్యాసతీర్థం కూడా అక్కడ చూడాల్సినది. వ్యాసపురియే కాలక్రమముగా వాసర అని పిలువడబడింది. సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు యొక్క అపరరూపంగా భావింపబడి సమస్త ప్రపంచమునకు, ఆధ్యాత్మిక గురువుగా, జ్ఞానజ్యోతి స్వరూపుడై వెలిసిన శ్రీ వేదవ్యాస ముని నామమున, ప్రసిద్ధమైన వ్యాస తీర్థం సర్వతీర్థాలకు తలమానికం!

బ్రహ్మ నారదునికి వ్యాస తీర్థ మహిమ ఇలా వివరించాడు. నారదా! ఈ వ్యాస తీర్థమున స్నానము గావించినచో సమస్త మనోరథములు నెరవేరతాయి. సంతానార్థులకు సంతానం, భోగభాగ్యములు కోరువారిందు స్నానం చేసి దేవిని ఉపాసిస్తే సమస్త భోగభాగ్యములు, మోక్షమును కోరువారీ వ్యాస తీర్థమున స్నానించినా జీవన్ముక్తుల గుదురు.

అంటే ఎవరైతే వ్యాస తీర్థమున ఒక్క సారియైననూ స్నానం చేస్తారో, సమస్త పాపముల నుంచి తక్షణ విముక్తి. ఈ వ్యాస తీర్థ మహత్యం పారాయణ చేసి నవారికి, వ్యాసుడు గావించిన సరస్వతీ స్తోత్రములను ఎవరు నియమ పూర్వకంగా పఠింతురో, ఎవరు ఎందులో వారికి తప్పక శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి కటాక్షం వుంటుందిట.

## సంకీర్తన

సద్గురువులు తమ శిష్యులని పుత్రవాత్సల్యంతో చూస్తారు. పరబ్రహ్మ స్వరూపంగా చూస్తారు. శాంతానికి ఉనికిపట్టు, వారు చాపల్యం గానీ, చిరాకు గాని పొందరు. తమ పాండిత్యానికి గర్వించరు.వారికి ధనవంతులు, పేదలు, నీచులు... అనే తారతమ్యం వుండనే వుండదు. మన పూర్వజన్మ సుకృతం వల్ల సాయిబాబాను అలాంటి సద్గురువును పొందాం. (షిర్డీలో చాలా బాగా ఉత్సవాలుంటాయి).

భక్తి విశ్వాసాలనే హృదయ దీపాన్ని సరిచేసి ప్రేమ అనే వత్తిని వెలిగించాలి. అప్పుడు జ్ఞానజ్యోతి (ఆత్మసాక్షాత్కారం) వెలిగి ఎక్కువ తేజస్సుతో ప్రకాశిస్తుంది.

ప్రేమలేని జ్ఞానం వృఎధా. ప్రేమ లేనిదే చదువులు, వినుట, నేర్చుట అనేవి నిష్ఫలములు. ప్రేమ నివసిస్తే భక్తి, శాంతి, స్వేచ్ఛ వరుసగా వస్తాయి. యదార్థమైన కాంక్ష, ఉత్తమ భావమున్న చోట భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. అదే ప్రేమ మోక్షానికి మార్గం... గురువు ద్వారానే!

**ఓం గురుభ్యోనమః - ఈ.హరిహర్ నందన్.**

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

PASS IN SHORT PERIOD
(for Oct 17 Chance)
for Discontinued (A.U.)
Coaching for.. BA / B.Com / B.Sc.
MA / M.Com / M.Sc.,
B.Tech / M.Tech / Diploma
Inter / 10th / MBA
98487 21118
98487 31118

## రావణాపల్లి రిజర్వాయర్‌కు జలకళ



మూడు గేట్ల వద్ద నీరు పోతున్న దృశ్యం

రావికమతం : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కల్యాణపు లోవ జలాశయంలో ఇన్‌పో కొనసాగుతుంది. దీంతో మూడు గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెట్టారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 460 అడుగుల కాగా అధికారులు 459 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతూ వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. రిజర్వాయర్ ఎగువ కొండల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఇన్‌ప్లో బాగా పెరిగిందని ప్రాజెక్టు ఏఈ కె.సత్యనారాయణ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని వరహా నదిలోకి విడిచి పెడుతున్నామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరుసార్లు గేట్లు ఎత్తాల్సి వచ్చిందని తెలిపారు.

## వివాహం ఇష్టం లేక
# యువతి ఆత్మహత్య



మృతి చెందిన రమ్య

నర్సీపట్నం : వివాహం ఇష్టం లేక యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సీపట్నం శివపురంలో చోటుచేసుకుంది.మృతురాలు రమ్య(27) నర్సీపట్నం నారాయణ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. ఇటీవల రమ్య తల్లిదండ్రులు వివాహం చేయడానికి సంబంధాలు చూస్తున్నారు. వివాహం తనకు ఇష్టం లేదని తల్లిదండ్రులకు తెలిపింది. ఈ నేపథ్యంలో తల్లి దండ్రులు రమ్య సోదరుడు దగ్గరకు దసరా సెలవులకు బెంగుళూరు వెళ్లారు. ఇంట్లో రమ్య ఒంటరిగా ఉంది. తల్లిదండ్రులు తనకు వివాహం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని భావించిన రమ్య సోమవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఎస్సై అప్పన్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా దర్బార్‌తో ప్రజాసమస్యలు సత్వరం పరిష్కారం

- అందరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పింఛన్లు, తాగునీరు, వీధి దీపాలు, మురుగుకాల్వలు, రోడ్లు తదితర అన్నీ రకాల ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వెల్లడించారు. ప్రజాసమస్యలు పరిష్కరించడానికే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. 25వవార్డు, ఎంవిడిఎం పాఠశాల ఎదురుగా మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్నీ సమస్యలు రికార్డుల్లో నిక్షిప్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌తో ప్రజకు మరింత చేరువయ్యామన్నారు. వారి వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరిస్తుండడంతో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. కొన్ని దీర్ఘకాలిక సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలో వాటిని కూడా పరిష్కరించి ప్రజల మన్ననలు చూరగొంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నీ ప్రాంతాల ప్రజలు ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి శ్రీను, తిత్తి సాయి బలరాం, బెహరా వెంకటరత్నం, బుచ్చా రాముడ్డి, బర్ఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆనంతగిరిలో భారీ వర్షం

అనంతగిరి : ఆనంతగిరిలో వైఎస్సార్ సంత బయలు దగ్గర ఉన్న భారీ మోడు సగం పడింది.. అయితే ఆనంతగిరిలో భారీ వర్షం పడింది అలాగే అనంతగిరి సంత కావడం. పెద్ద ప్రాణాపాయం తప్పింది.. అధిక సంఖ్యలో గిరిజనులు క్రయ విక్రయాలు చేపడుతుంటారు.అయితే అక్కడ ఎవరు లేకపోవడం వల్ల పెను ప్రమాదమే తప్పింది. అయితే గతం లో ఎన్నో మార్లు ఆర్అండ్‌బి అధికార్లులకు తెలిపిన పట్టించుకోలేదని అక్కడ స్థానికులు ప్రజలు వాపోతున్నారు. అసలు ఆర్అండ్‌బి అధికారులు ఉన్నట్టు లేనట్టా అని అంటున్నారు.

## గిరిజనుల సొంతింటి కల నెరవేరింది

అనంతగిరి : ఎమ్‌పిపి గుజ్జెల పైడీతల్లి ప్రపంచ అవాస దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా 17గృహాలు ప్రవేశాలు చేశారు. అనంతగిరి మండలం లో 2016- 2017 సంవత్సరం సంబంధించి 172 మంజూరు అయ్యాయని అ ఒకొక్క గృహానికి 1.50 లక్ష హౌసింగ్ ఏఈ రవిబాబు అన్నారు. వాటిలో 17 గృహాలు పనులు పూర్తి అయ్యినట్లు తెలిపారు.

# ఐలయ్యపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్వేరోస్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎం.చిట్టియ్య

నర్సీపట్నం : సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కంచె ఐలయ్య పై అన్యాయంగా నమోదు అవుతున్న కేసులను ఉపసంహరిం చుకోవాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో స్వేలోస్ ఇంటర్నేషల్ విశాఖజిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గీతం స్కూల్ ఆవరణలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్వేలోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు ఎం.చిట్టియ్య మాట్లాడుతూ ప్రొఫెసర్ ఐలయ్యకు మద్దతుగా దేశంలో ఉన్న 85శాతం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, బహుజనులు రోడ్డు మీదకు వచ్చి చైతన్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆయనకు రక్షణ కల్పించాలని ప్రతినిధులు కోరారు. గోవింద, పన్సారే, నరేంద్ర దభాల్కర్‌కాల్బర్గి, గౌరీ లంకేష్‌లాంటిమేధావులను పొట్టన పెట్టుకున్న ఆరాచక వాదులకు హెచ్చరికగా ఐలయ్యను అలా బలి కానివ్వమన్నారు. సామాజికవేత్త ఐలయ్యను కాపాడుకుంటామని అన్నారు. మేధావి ఆలోచన విధానంతో విభేదిస్తే చర్చకు రావాలని, అంతేకాని బెదిరింపులకు పాల్పడవద్దని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో , డిహెచ్‌పిఎస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.అప్పలరాజు, సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఒమ్మి నర్సింగరావు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ, జెవివి.రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి, అంబేద్కర్ ఇండియన్స్‌మిషన్ జిల్లా కన్వీనర్ చిట్ల అప్పారావు, ఎస్.వీరబాబు, సిఐటియు నర్సీపట్నం డివిజన్ కార్యదర్శి ఎ.రాజు, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడి రాజుబాబు, సిహెచ్.ఆనందరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, దళిత కులాల ఐక్య వేదిక అధ్యక్షలు చిట్ల చలపతిఏటిఎం జిల్లా కన్వీనర్ ఎస్.వీరబాబు, పి.వెంకటేశ్వరరావు, స్వేరోస్ ప్రతినిధులు బండి వెంకటరమణ, ఐ.చంటిబాబు, కె.పెదబాబు, ఎం.సతీష్ పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

గెలిపొందిన విజేతలకు బహుమతులు అందజేత

పరవాడ : గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సిఎఫ్ డబ్లుయూత్, పరవాడ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 2వతేదిన సాయంత్రం పరవాడ శ్రీ మరిడిమాంబ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ క్విజ్ పోటీలకు వివిధ మండలాల నుంచి 18 గ్రూపులు ( 72 మంది) పాల్గొన్నాయి. కార్యక్రమం అనంతరం గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా 5 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 3 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 2 వేల రూపాయలు పెద్దల సమక్షంలో సిఎఫ్ డబ్లు యూత్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసినటువంటి పరవాడ ఎమ్‌పిటిసి సభ్యులు మరియుసెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరైనపైల శ్రీనివాసరావు, గొర్లివానిపాలెం ఎమ్ పిటిసిసభ్యులు డాక్టర్ గొర్లి శ్రీనివాస్, మాజీఎమ్ పిటిసిసభ్యులు మోటూరు సన్యాసి నాయుడు పరవాడ గ్రామ సర్పంచ్ చుక్క రాము నాయుడు, గ్రామ పెద్దలు పైల పోతునాయుడు, చుక్క సన్యాసిరావు చేతులుమీదగా బహు మతులు అందజేసారు. ఈకార్యక్రమంలో కోరుపోలు గంగాధర్, పైల హరీష్, రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, సిఎఫ్ డబ్లు యూత్ ప్రెసిడెంట్ వర్రీ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్ మరియు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# గంగపుత్రులుకు అండగా వైసీపీ

ఉద్యోగాల విషయంలో కలెక్టర్‌ను కలిసిన అమర్‌నాథ్



పరవాడ : పరవాడ మండలము ముత్యాలమ్మ పాలెం గ్రామంలో గంగపుత్రలు ఉద్యోగాల విషయంలో వైయస్‌అర్ కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని వైయస్‌అర్ కాంగ్రెస్ పార్టీ జిల్లాఅధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గత కొన్నేళ్ళుగా పార్మాసిటిలో ఉద్యోగాలు కోసము పోరాటము చేస్తున్న ఎవంరూ స్పందించలేదని ముత్యాలమ్మపాలెం గ్రామస్తులు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైలశ్రీనువాసురావు వద్ద అవేదన వ్యక్తము చేశారు. వెంటనే అయన స్పందించి ఈ విషయాన్ని వైయస్‌అర్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అన్నంరెడ్డి అదీఫ్ రాజ్ మరియు వైయస్‌అర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకువెళ్ళారు. గంగపుత్రలు ఉద్యోగాలు విషయంలో అయన మంగళవారము కలెక్టర్‌కు వినతి పత్రము అందజేశారు. కలెక్టర్‌కు వినతి పత్రము అందజేసిన వారిలో అయనతో పాటు వైయస్‌అర్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డిఅదీఫ్‌రాజు, సిఇసి మెంబర్ పైల శ్రీనువాసురావు, చిన మసేను, అమ్మోరు, మహేష్, నూకరాజు, ముత్యాలురావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం



లక్కవరపుకోట: శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం మండలంలోని ఇంటింటికి తెలుగుదేశం కార్య క్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమెకు ప్రజల నుండి సమస్యలు వెల్లువెత్తాయి. ముందుగా ఎమ్మెల్యే లక్కవరపుకోట మండల కేంద్రంలో నిర్వహించారు. ఇక్కడ హాస్టలు జంక్షన్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బిసి కాలనీలో ఇంటింటికి వెళ్ళి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. తదుపరి కొట్యాడ గ్రామం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గ్రామంలో జరిగిన సభలో గ్రామస్థులు ఎమ్మెల్యేకు సమస్యలు వెలువెత్తారు. ఎన్టీఆర్ హౌసింగ్ జిల్లాలు సకాలంలో అందడం లేదని, భూ సమస్యలు పరిష్కారం కాలేదని, రేషను షాపు ద్వారా కిరోసిన్ అందజేయలేదని నివేదించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు అన్ని ఒక్కొక్కటిగా పరిష్కారం కాగలవన్నారు. కొట్యాడ తర్వాత తలారి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించి, గ్రామస్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటిసి ఈశ్వరరావు, ఎంపిపి రమణమూర్తి, మండల నాయకులు మల్లునాయుడు, పెదబాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఖాసా పేట, వీరభద్రపేట, కళ్లెపల్లి, గురువారం లింగంపేట, మార్లాపల్లి, కిత్తన్నపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించనున్నారు.

## చుక్కవలసలో
# రక్తదాన శిబిరం



గరివిడి: మండలంలోని చుక్కవలస గ్రామంలో ముడిల లక్ష్మీ నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ యువత స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ శిబిరంలో 31మంది దాతలు రక్తదానం చేశారు. విజయనగరం మహరాజా ప్రభుత్వ రక్తనిది కేంద్రం వారు రక్త నిల్వలను సేకరించి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో డా॥దొర సర్పంచి ముడిల పైడిరాజు, ఎం.వి.రమణ, ఎస్. జగన్నాధం, సత్య నారాయణ, గ్రామ యువత పాల్గొన్నారు.

## భార్య మందలించిందని భర్త అదృశ్యం



భర్త రాము

రావికమతం : చీటిల డబ్బు ఇంట్లో ఎవరికి తెలియకుండా వాడుకున్న భర్తను భార్య మందలించడంతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై శేఖరం తెలిపారు. మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన మడగల రాము(45) రైసు మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. చీటిల వ్యాపారి వద్ద రూ.20వేలు రాము అప్పుడగా తీసుకొని ఇంటిలో ఎవరికీ తెలియకుండా వాడుకున్నాడు. కొంత కాలం రాము భార్య లక్ష్మికి చీటిల వ్యాపారి వద్ద తీసుకున్న అప్పు సంగతి తెలియడంతో ఆమె భర్త రాముని నిలదీసింది. దీంతో రాము సెప్టెంబర్ 28న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి రాము ఆచూకీ కోసం బంధువుల ఇళ్ల వద్ద సమీప గ్రామాలలోను వెతికిన కనిపించకపోవడంతో రాము భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నిధుల వరదతో మెరవనున్న నర్సీపట్నం మున్సిపాలిటీ

మున్సిపల్ వైస్ ఛైర్మన్ సన్యాసిపాత్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ నిధుల వరదతో మెరవనుందని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో సెప్టిక్‌ట్యాంక్, మురికినీరు శుద్ధి చేసి వ్యర్థాలను ట్రీట్‌మెంట్ అనంతరం తరలించుటకు రూ.11.49కోట్లతో డిపిఆర్ ప్రభుత్వం వారికి పంపడం జరిగిందన్నారు. దీంతో పాటు రూ.2.75కోట్లు ఎస్సీ ప్రాంతాల్లో అభివృద్ధి చేయడానికి నిధులు విడుదల అయ్యాయన్నారు. బొడ్డేపల్లిలో 10, 11వ వార్డు, బలిఘట్టం 16వ వార్డు, నర్సీపట్నంలో 3వ వార్డు ఎస్సీ ఏరియాలో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మిస్తారన్నారు. ఎస్టీ ప్రాంతాల్లో అభివృద్ధి చేసేందుకు రూ.45లక్షలు మంజూరయ్యాయన్నారు. 19వ లింగాపురంలోని సిమెంట్, రోడ్లు కాలువలు నిర్మిస్తారన్నారు. పై నిధులు కాకుండా అదనంగా రూ.కోటి పురపాలక సంఘానికి స్టేట్ ఫైనాల్స్ కమిషన్ ప్రత్యేక గ్రాంటు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో పట్టణంలోని ముఖ్యమైన సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షులు చినరమణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి




నర్సీపట్నం : రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి తెగుళ్లను నివారించుకోవాలని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. . మంగళవారం మండలంలో ధర్మసాగరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వర్షాల కారణంగా తెగులు వ్యాపిస్తాయన్నారు. దీన్ని వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి కె.ఝాన్సీలక్ష్మి గ్రామంలోని పంట పొలాల్లో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ మేరకు కంది, వరి పొలాలకు సందర్శించారు. వర్షాల కారణంగా చాలా మంది వరి పొలాల్లో పాముపొడ తెగులు, పొట్టకుళ్లు తెగుళ్లు సోకినట్లు అధికారులు గుర్తించారు. దీని నివారణ నిమిత్తం హెక్సాకాన్‌జోల్ లేదా వాలిడామైసి ఒక ఎంఎల్ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ పిబి.సుగుణ, పి.దుర్గా, సుకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONOURABLE
II ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM.
E.P.33/2017 O.S.572/2013**

**Between :**
**Gajibilli Bhaskara Rao ...Dhr/Plaintiff**
**And:**
**Annavarapu Madhavi Mohan ...Jdr/Defendant**

**NOTICE**


**Notice to JDR**

**Annavarapu Madhavi Mohan, W/o.A.M.M.Rao, Hindu, aged about 50 years, residing at Flat No.3F, Block-A, Parklane Residency, VUDA Park, Visakhapatnam.**

Please take notice that the above named Decree holder filed the above E.P.33/2017 in O.S.572/2013 against the Jdr for execution of a registered sale deed under order 21 Rule 34 of CPC and the same is stands posted to **25-10-2017** for your appearance either in person or through a pleader on the above said date at **10-30 AM** to answer all material questions failing which the Execution petition will be heard and determined in your absence exparte as per law.

**B.K.NAIDU
Advocate
D.No.50-81-57,
Seethammapeta,
Visakhapatnam-16.
Cell: 98480-77747**

# వెన్నపు రవి ఆధ్వర్యంలో "స్వచ్ఛభారత్"



అమలాపురం : అల్లవరం మండలం మోగలమూరు గ్రామ పరిధిలో సిరగట్లపల్లి వద్ద మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్,ఆత్మ కమిటి మెంబర్,వెన్నపు రవి ఆద్వర్యంలో స్వచ్ఛబారత్ కార్యక్రమం చేపట్టారు.

ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గోన్నారు. ఈసందర్బంగా వెన్నపు రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్‌లో పాల్గోని పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్య క్రమాలు ప్రతిష్ఠాత్మంకంగా తీసుకోవడం మేకాకుండా, సంపూర్ణ పారిశుద్ధ గ్రామాలుగా గుర్తించి ప్రభుత్వాలు అధిక నిధులు మంజూరు చేస్తున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెన్నపు దుర్గాదేవి,రోక్కాల సాయిబాబు, వెన్నపు శ్రీను,రోక్కాల సత్యనారాయణ,వెన్నపు నాగవేణి, రేవు మావుళ్ళమ్మ,సాదనాల సత్యనారాయణ, నందిక మంగాదేవి, నందిక వెర్రయ్య,వి రాజ్యలక్ష్మీ తదితరు లు పాల్గోన్నారు.

# కోకనాడ ఛాంబర్ అధ్యక్షునిగా దంటు సూర్యారావు

కాకినాడ : 148 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర కలిగిన కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా దంటు సూర్యారావు 33వ సారి తిరిగి ఎన్నికయ్యారు.1984 నుండి 1992లో మినహా అన్ని సార్లు దంటును ఛాంబర్ డైరెక్టర్లు ఎన్నుకున్నారు. మంగళవారం ఛాంబర్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డైరెక్టర్లుగా ఎకె.విశ్వనాధం, వి.భాస్కర రావు, సి.నరసింహారావు, ఎవి.రంగారావు ఎఎస్.కుమార్, ఆర్‌హెచ్ రాంగోపాల్, పి.వెంకటేశ్వరరావులు తిరిగి ఎన్నికకాగా నూతనంగా అశోక్ కుమార్ రౌత్ ఎన్నికయ్యారు.33వ సారి ఎన్నికైన దంటుకు ఛాంబర్ డైరెక్టర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

## నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండారు

రావులపాలెం : నియోజక వర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజా సమస్యలు తెలుసు కునేందుకు కృషి చేస్తున్ననియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు మంగళవారం మండల పరిధి దేవరపల్లిలో ఇంటింటికి తెలుగుదేశం కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా గ్రామ స్తులు సత్యానందరావుకు అపూర్వ స్వాగతం పలికారు. బండారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలన్నా ఒక్క చంద్రబాబుకే సాధ్యమని కొనియాడారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై గ్రామానికి చెందిన నామాల సాయి సత్యనారాయణ, నరసింహమూర్తి, జువ్వయ్య, వెంకట్, గోవింద్ గుత్తుల సత్యనారాయణ లతోపాటు సుమారు 100 మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారిని బండారు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బండారు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసు కున్నారు.

ఈ సందర్భముగా డిసిఎమ్ఎస్ చైర్మన్ కె.వి.సత్యనారాయణరెడ్డి తో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు బండారు సంజీవ్, కోరం జయకుమార్, వైవి, కేతా శ్రీనివాస్, కాసా విజయకుమార్, చిట్టూరి రమేష్, మేడపాటి కాసురెడ్డి, ఆనే ముసలయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవరత్నాలతోనే అన్ని వర్గాలకు సంక్షేమ పధకాలు అందుతాయి



ఆలమూరు :- వైయస్సార్‌సిపి అధ్యక్షులు జగన్మోహనరెడ్డి అమలు చేయనున్న నవరత్నాలు పధకాలుతోనే అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కలవచర్ల సర్పంచ్ గానుగుల కృష్ణార్జునరావు అన్నారు. వైయస్సార్‌సిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కలవచర్ల గ్రామంలో వైయస్సార్ కుటుంబం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి నవరత్నాలు పధకాలను వివరించారు. అలాగే పలువురిని వైయస్సార్ కుటుంబంలో సభ్యులుగా నమోదు చేసారు. కార్యక్రమంలో నామన దుర్గాప్రసాద్, వనుం నాగరాజు, చెల్లబోయిన రాముడు, కుడిపూడి లోవ సత్యనారాయణ, వనుం సురేంద్ర, గుత్తుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్ధులకు దంతవైద్యశిభిరాలు

కాకినాడ : నగరంలోవున్న కార్పొరేషన్ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనుఅభ్యశిస్తున్న విద్యార్ధిని విద్యార్ధులకు ఉచితంగా దంతవైద్య శిభిరాలను రోటరీ స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జెజె డెంటల్ హాస్పటల్ వైద్యులు డా. రఘురామ్ చెప్పారు. రోటరీ స్మార్ట్‌సిటీ సభ్యత్వాన్ని రోటరీ గవర్నర్ జి.వి.రామారావు చేతులమీదుగా స్వీకరించిన ఆయన క్లబ్ ఆధ్వర్యంలో దంతవైద్య శిభిరాలను నిర్వహణకు అయ్యే ఖర్చుఅంతా తామే భరిస్తామని ప్రకటించారు. ప్రతీ ఆదివారం ఉదయం 3 గం॥లపాటు ఈ వైద్య శిభిరాన్ని నిర్వహించేవిధంగా చర్యలు తీసుకుంటామని విద్యార్ధులు పేరెంట్స్ మరియు పాఠశాలల సిబ్బందికూడా ఈ వైద్య సేవలను అందిస్తామని ప్రకటించారు. రోటరీ వంటి అంతర్జాతీయ సేవా సంస్థ అందిస్తున్న సేవలు స్మార్ట్‌సిటీ క్లబ్ అధ్యక్షులు వాకచర్ల రవి పర్యవేక్షణలో సమాజానికి అందేవిధంగా చర్యలు తీసుకుంటామని డా. రఘురామ్ చెప్పారు. జె.జె. హాస్పటల్ స్థాపించి 7దశాబ్దాలపైగా కావడంతో ప్రజలలోవున్న నమ్మకాన్ని మరియు గౌరవాన్ని నిలబెట్టుకునేవిధంగా సమాజసేవా కార్యక్రమంలో హాస్పటల్ భాగస్వామి డా. నందకిషోర్‌తో కలిసి చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వాకచర్ల రవి కార్యదర్శి కూరెళ్ళ సూర్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ బ్లూస్టార్ రవి. తోపాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నృత్యం భగవంతునికి ప్రీతికరం : గోవిందరావు



కాకినాడ : నృత్యోత్సవం ద్వారా భగవంతున్ని ప్రశన్నం చేసుకోవడానికి ఎంతో అవకాశం ఉంటుందని నృత్య పాఠశాల నడుపుతున్నవారి కృషి శ్లాఘనీయమని విష్ణాలయ పాలకమండలి ఛైర్మన్ బడే గోవిందరావు అన్నారు. నగరంలో వివిధ ఆలయలలో నృత్యప్రదర్శనలు ఇచ్చే భక్తులను విశేషంగా అలరింపచేసిన శ్రీ జ్యోతీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకురాలు మద్దాన లక్ష్మిజ్యోతితోపాటు 20మంది విద్యార్ధులను ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించి అభినందించారు. విష్ణాలయం కేంద్రంగా నృత్యపాఠశాల నిర్వహిస్తు అనేకమందికి ఈ రంగంలో శిక్షణ ఇవ్వడమేకాక ఎందరికో మార్గదర్శకమవుతున్నారని లక్ష్మి సేవలను కొనియాడారు. ఇదేవేదికపై వెంకటలక్ష్మి కోలాట బృందం 20 మందితో చేసిన కోలాట నృత్యం, మహిషాసుర మర్ధని నృత్యాన్ని కళ్యాణి చేసిన విధానం భక్తులలో విశేభక్తిభావాన్ని నెలకొల్పింది.

# పల్లె నిద్ర కార్యక్రమంలో అధికారులు



ఆలమూరు :- జిల్లా కలెక్టర్ గారి ఆదేశములు మేరకు ఆలమూరు మండలంలో 9 గ్రామాలలో మంగళవారం అధికారులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సూర్యారావుపేట గ్రామానికి మండల స్పెషల్ అధికారి కె. కృష్ణ శృతి, బడుగువానిలంక గ్రామానికి ఎంపిడిఓ నాతి బుజ్జి, ఆలమూరు గ్రామానికి తహశీల్దార్ కె.పద్మావతి, చొప్పెలకు ఏ.ఓ. కె.వి.ఎన్.రమేష్ కుమార్, మూలస్థాన అగ్రహారం గ్రామానికి హౌసింగ్ ఏఈ ఎస్.జేజిబాబు, గుమ్మిలేరు గ్రామానికి ఏపిఓ ఏ.వి.రామారావు, పినపళ్ల గ్రామానికి ఏపిఎమ్ (వెలుగు) ఎమ్.సాంబశి వరావు, నవాబుపేట ఇరిగేషన్ ఏఈ కె.శివకుమార్, జొన్నాడ మండల ఇంజనీరింగ్ అధికారి బి.రంగనాయకులు ఈ కార్యక్రమానికి అధికారులుగా నియమించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామపంచాయితీలు వద్ద ఆయా గ్రామ దత్తతాధికారులు గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పధకాలు, గ్రామంలో ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛభారత్, వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర నిర్వహణపై ప్రజలు నుండి వివరాలు సేకరించి, వాటిపై ఆయాశాఖలకు సంబంధిం చిన అధికారులకు పలు సూచనలు యిచ్చి, పలు ఆదేశాలు జారీచేసారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జన్మభూమి కమిటీ సభ్యులు, కార్యదర్శులు, విఆర్వోలు, అంగన్‌వాడీలు, డీలర్లు, వార్డుమెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం

## - జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి
## - ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్

పెద్దాపురం : నిత్యం విలేఖర్లపై జరుగుతున్న దాడులను ఖండించాలని కోరుతూ గాంధీజీ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ పెద్దాపురం శాఖ పెద్దాపురం పట్టణంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పై విధంగా జర్నలిస్టులు తమ నిరసన తెలిపారు.

స్వతంత్ర భారత దేశంలో పౌరులకు లభించిన రాజ్యాంగ హక్కులను, పత్రికా స్వేచ్ఛను కొంతమంది కాలరాసి, ఉల్లంఘిస్తు న్నారని, అటువంటి చర్యలను అరికట్టి, విలేఖర్లపై దాడులు చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దాపురం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఎం. సూర్యనారాయణ, అధ్యక్షుడు అలమండ రంగనాధ్ (రమేష్), ఉపాధ్యక్షుడు మురళి, కార్యదర్శి తిరుపతిరాజు, సహాయ కార్యదర్శి రవిబాబు, సహాయ కార్యదర్శి సారథి, ట్రెజరర్ ఎం. సత్తిరాజు, రాష్ట్ర కార్యదర్శులు అధికారి, మున్ని, సభ్యులు శ్రీనివాస్, సుబ్బారావు, ప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'భారత్ కో జానో' క్విజ్ పోటీలు

విశాఖపట్నం : భారత్ వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ద్వారకానగర్ దరి శ్రీ కృష్ణా విద్యామందిరంలో విద్యార్థుల కొరకు భారత్ కో జానో క్విజ్ పోటీలను విశాఖ జిల్లాస్థాయిలో నిర్వహించుచున్నాము. క్విజ్ పోటీలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులను జూనియర్లుగాను, 9, 10 వ తరగతుల విద్యార్థులను సీనియర్లుగా పరిగణించబడతారు. క్విజ్ పోటీలలో ప్రభుత్వానికి సంబంధించిన జివిఎంసి పాఠశాలల జెడ్పీ పాఠశాలల మరియు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు ఎవరైనా పాల్గొనవచ్చును. ఈ క్విజ్ పోటీలకు ప్రవేశం ఉచితం. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేయడమే కాకుండా విజేతలకు పోటీలు నిర్వహించిన రోజునే నగరానికి చెందిన ప్రముఖుల చేతులమీదుగా బహూమతులు అందజేయ బడతాయి. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని పొందినవారు బి.వి.పి. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారు. నగర పాల్గొనదలచినవారు 9వ తేదీ లోపుగా అక్కయ్యపాలెం, 80 అడుగుల రోడ్డుకు ఎదురుగా గల వాగ్దేవి టాలెంట్ స్కూల్‌నందు ప్రవేశపత్రాన్ని పొంది దానిని నింపి అదే పాఠశాలలో అందజేయవలెను. మరిన్ని వివరముల కొరకు 9246622563, 9848885186నందు సంప్రదించవలెను.

# ఈ నెల 5 నుంచి అగ్రిగోల్డ్ బాధితుల నమోదు

అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఈ నెల 5న అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు నమోదు చేసుకుంటారని ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ముఖ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 660 మండలాల్లోని పోలీస్ స్టేషన్‌లలో బాధితుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. సీఐడీ పర్యవేక్షణలో జరిగే ఈ నమోదు అవకాశాన్ని అగ్రిగోల్డ్ బాధితులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఖాతాదారులకు ఈ సమాచారం అందించేందుకు ప్రతీ మండలానికి పది మందితో కమిటీలు వేస్తామన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల పోరాటంతో దిగివచ్చిన ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5 కోట్ల పరిహారం విడుదల చేస్తూ జీవోలు ఇచ్చిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయడంలో ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. పరిహారం అందజేతకు జీవోలు ఇచ్చి నెల రోజులు దాటినా ప్రభుత్వం అలక్ష్యం వహిస్తోందని, తక్షణం బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అగ్రిగోల్డ్ కంపెనీని టేకోవర్ చేసేందుకు ఎస్సెల్ గ్రూప్ రూ.10కోట్లు డిపాజిట్ చేసిందని, మరో నాలుగు వారాల్లో హైకోర్టుకు సంబంధించిన విధానం పూర్తి అవుతుందన్నారు. కొంతమంది బాధితుల వద్ద బాండ్‌లను అగ్రిగోల్డ్ యాజమాన్యం తీసుకుందని, రూ.700కోట్ల వరకు చెక్‌లు ఇచ్చిందని, అటువంటి వారికి ఏ ఆధారం ఉన్న పరిగణలోకి తీసుకోవాలని ముప్పాళ్ల కోరారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

పెదకూరపాడు : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల మైదానంలో గ్రామ ప్రజల సహకారంతో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ స్మారక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ప్రారంభించారు. నిర్వాహకులు గుత్తా కవితా రాములను ఇందుకు సహకరించిన గ్రామస్థులను ఆయన అభినం దించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. విశిష్ఠ అతిథులుగా జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్ వరప్రసాద్, డిప్యూటీ డీఈవో రామకృష్ణారావు, ఏపీపీఈటీ అసోసియేషణ్ అధ్యక్షుడు కరిముల్లా చౌదరి హాజరయ్యారు.

# రానున్న రెండేళ్లలో 10 లక్షల పక్కా గృహాల నిర్మాణం

## ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు



పెద్దాపురం : రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో రూ.15 వేల కోట్ల వ్యయంతో 10 లక్షల పక్కా గృహాల నిర్మాణం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవ జిల్లాస్థాయి ముగింపు కార్యక్రమాన్ని పెద్దాపురం పట్టణం మున్సిపల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ బహిరంగ సభకు మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఈ గృహనిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది ఎన్టీ రామారావు అని పేర్కొన్నారు. 1984లో తాటాకు పాకలు ఉండేవని, వాటిని తొలగించి రూ. 6 వేలతో పెంకుటిళ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఆ తర్వాత నుంచి ప్రభుత్వం రూ.40 వేల నుంచి రూ.70 వేలు పథకం, ఇపుడు రూ. 1.50 లక్షల పథకంతో పేదలకు సొంత భవనాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వచ్ఛత విషయంలో ఇతర దేశాలతో పోలిస్తే మన దేశం ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. పౌరుల భాగ స్వామ్యం ఉన్ననాడే స్వచ్ఛతను సాధించగల మన్నారు. మనలో చాలా మంది తమ ఇళ్లను శుభ్రం చేసుకోవడం తప్ప పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచన ఉండదన్నారు.

ప్రజా ప్రతినిధులు పాలసీని తయారు చేస్తే దానిని అధికారులు అమలు చేస్తారని, అది విజయవంతం కావాలంటే అందుకు గ్రామీణ, పట్టణాల పౌరుల సహకారం అవసరం ఉందన్నారు. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తోట నరసింహం, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

# బోయ కులస్థులను ఎస్టీలో చేర్చవద్దు

రావులపాలెం : రాజ్యాంగం ఏర్పడిన తరువాత సమాజంలో బిసి కులాలకు చెందిన వారైన బోయలను ఎస్టిలో చేర్చడం అన్యాయమని గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ సింగం కృష్ణ అన్నారు. రాష్ట్రంలో లక్షలాది గిరి జన ప్రజలకు అన్యాయం జరుగు తుందని వారికి అందే రిజర్వేషన్ ఫలాలు కూడా అందకుండా పోతాయని ఆర్థికంగా రాజకీయంగా బలపడి ఉన్న బోయలను ఎస్టి జాబితాలో చేర్చాలనే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని జిల్లా కోకన్వీనర్‌లు కుర్రా శ్రీనివాస్, భారతి శ్రీనివాస్‌లు అన్నారు. బోయలను ఎస్టిలో చేర్చడం వల్ల గిరిజనులు తీవ్ర అన్యాయానికి గురవుతారని ఈ సందర్భముగా డిమాండు చేసారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దారు కార్యాలయం వద్దకు చేరుకొని తహశీల్దారు సిహెచ్ ఉదయ భాస్కర్‌కు తమ సమస్యల పరిష్కారానికి వినతి పత్రం సమర్పించారు.

# చిత్రభాను



## పాప ఫేటే మారిపోయింది

కోలీవుడ్ లో నిన్నా మొన్నటి వరకూ ఓవియా అనే నటి ఉందీ అని చాలా తక్కువమందికే తెలుసు. పాపం చాలా ఏళ్ళుగా ఒక్కటంటే ఒక్క బ్రేక్ కోసం ఎదురు చూస్తూనే ఉంది. అయితే ఆ బ్రేక్ ఇప్పుడు బిగ్ బాస్ రూపం లోవచ్చింది. ఒక్క సారిగా అమ్మడి రేంజ్ మారిపోయింది ఈ రియాలిటీ షో వల్ల. చిట్టి నిక్కర్లు వేసుకుని ప్రేక్షకులని రెచ్చగొట్టేలా నవ్వులు విసురుతూ 'క్యూటీ పై' వేషాలతో కుర్రాళ్లని ఆకట్టుకుంది. తర్వాత తనపై బిగ్‌బాస్ హౌస్‌లో పాలిటిక్స్ జరిగితే అన్నిటికీ గట్టిగా బదులిచ్చి మరీ నిలబడింది.

బిగ్‌బాస్ కొనసాగుతూండగానే బయట ఓవియా ఆర్మీ అంటూ సోషల్ మీడియాలో తనకో సైన్యం ఏర్పడింది. తమిళ బిగ్‌బాస్‌కి టీఆర్పీలు పెరగడంలో దోహదపడిన ఓవియా హౌస్‌లో జరిగే రాజకీయాలతో పడలేక బయటకి వాకౌట్ చేసింది. అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేసి సగంలో వచ్చేసినా కానీ ఓవియా ఇప్పుడు తమిళనాడులో చాలా ఖ్యాతి గడించింది. అందుకే ఆమెతో సినిమాలు తీయడానికి పలువురు నిర్మాతలు ఉత్సాహపడుతున్నారు. అంతేకాదు రకరకాల కంపెనీలు ఆమెతో ఎండార్స్మెంట్ల కోసం ఎగబడుతున్నాయట. ఆమెని బ్రాండ్ అంబాసిడర్ గా నియమించుకోవటానికి కొన్ని మాల్స్ ఇప్పటికే భారీ ఆఫర్లతో ఎదురుచూస్తున్నాయట. ఇప్పటికే ఒక హాట్ టాపిక్ ఏమిటంటే ఒక వస్త్రాల షోరూం ప్రకటన లో హన్సికా, తమన్నా చేస్తుండగా ఇప్పుడు తమన్నాని తప్పించిమరీ ఆ స్థానం లో ఈ బిగ్ బాస్ సుందరిని పెట్టుకున్నారట. తమన్నా లాంటి హీరోయిన్ ని పక్కకినెట్టి మరీ దూసుకుపోతోంది పాప. ముని/కాంచన సిరీస్‌లో మరో చిత్రం చేయడానికి ఉవ్విళ్లూరుతోన్న లారెన్స్ ఆ సినిమాలో ఓవియాని తీసుకున్నాడని సమాచారం.


## హృతిక్.. నీవు అంకుల్‌వి..



కంగన రనౌత్ తనను లైంగికంగా రెచ్చగొడుతూ మెయిల్స్ పంపిందని బాలీవుడ్ హీరో హ ృతిక్ రోషన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె చెల్లెలు రంగోలి చండెల్ స్పందించింది. తన సోదరి కంగన రనౌత్ ప్రతిష'ను దెబ్బ తీసే విధంగా వ్యాఖ్యలు చేసిన హ ృతిక్‌పై మండిపండింది. నీవు ఒక అంకుల్‌వి. నీతో సెక్స్ కోరుకునే అవసరం నా సోదరికి లేదు అని రంగోలి పేర్కొన్నది. గత కొద్దికాలం సద్దుమణిగిందనుకొన్న హ ృతిక్, కంగనా ప్రేమ వ్యవహారం మరోసారి భగ్గుమంటున్నది. ఇటీవల ఓ హిందీ టెలివిజన్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హ ృతిక్ ప్రవర్తనను కంగన బయటపెట్టింది. దాంతో కంగన తనను రెచ్చగొడుతూ ఈ-మెయిల్స్ పంపేదని ఇటీవల మీడియాకు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలో రంగోలి చండెల్ రంగంలోకి దిగింది. వరుస ట్వీట్లతో హ ృతిక్‌పై మాటల దాడి చేసింది. తన భార్య సుజానేతో వైవాహిక సంబంధాలు చెడిపోయిన సమయంలో హ ృతిక్ తన సోదరి కంగన వెంటపడ్డారు. తన బాధను చెప్పుకొని కంగన ఓదార్పు కోరాడు. లేకపోతే అంకుల్ లాంటి వయసు ఉన్న హ ృతిక్‌తో ప్రేమ వ్యవహారం జరుపాల్సిన అవసరం కంగనకు లేదు అని చండెల్ పేర్కొన్నది. తనను లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణలపై చేసిన పాత ఫిర్యాదును హ ృతిక్ ఓ టెలివిజన్‌కు ఇవ్వడాన్ని రంగోలి తప్పుపట్టింది. నీవు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం నిరాధారమైన ఆరోపణలతో ఇలా ముఖం దాచుకుంటున్నావా? అని నిలదీసింది. హ ృతిక్.. నీ మొదటి సినిమా రిలీజ్ అయినప్పుడు కంగన ఓ స్కూల్ విద్యార్థి. కంగనాకు నీవు అంకుల్ లాంటోడివి. నా సోదరి నిన్ను అంకుల్ అని పిలువడానికి అర్హుడివి అని రంగోలి చెడామడా వాయించింది.

నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హ ృతిక్ కుటుంబ సభ్యులకు సూచించింది. ఇలాంటి చీప్ ట్రిక్కులకు ప్రయత్నించకుండా భార్యా, పిల్లలను బాగా చూసుకుంటే మంచింది అని ట్వీట్‌లో పేర్కొన్నది.

## విలన్‌గా ప్రిన్స్ మహేశ్..



ప్రముఖ దర్శకుడు మురుగదాస్, ప్రిన్స్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వచ్చిన స్పైడర్ చిత్రం డివైడ్ టాక్‌తో ముందుకెళ్తున్నది. ఈ చిత్రంపై ప్రేక్షకుల, సినీ విమర్శకుల స్పందన ఎలా ఉన్నా కలెక్షన్ల పరంగా దూసుకెళు్తున్నది. ఇప్పటికే ప్రిన్స్ చిత్రం 100 కోట్ల క్లబ్‌లోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. స్పైడర్ భారీ అంచనాలను చేరుకోలేని నేపథ్యంలో మహేశ్, తమిళ సూపర్ స్టార్ విజయ్‌తో మురుగదాస్ రూపొందించబోయే ఓ మల్టీ స్టారర్ చిత్రానికి సంబంధించి ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవేమిటంటే.. ప్రిన్స్ ఇమేజ్, స్టామినాకు తగినట్టుగా స్పైడర్ చిత్రం లేదనే వాదన సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. అటు తమిళంలోనూ, ఇటు తెలుగులోనూ స్పైడర్ ప్రేక్షకులను ఆకట్టుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రిన్స్ మహేశ్ ప్రతిష'ను పెంచే విధంగా మురుగదాస్ ఓ ప్రయోగానికి సిద్ధమవుతున్నాడట. స్పైడర్ మిగిల్చిన చేదు అనుభవంతో కసిగా ఉన్న మురుగదాస్ మల్టీ స్టారర్ చిత్రానికి కథ రచిస్తున్నారట. అందులో తెలుగు సూపర్ స్టార్ మహేశ్, తమిళ సూపర్ విజయ్ నటించనున్నారట. ఈ చిత్రంలో ఇద్దరు సూపర్ స్టార్లు విలన్లేనట. ఇద్దరు విలన్లు అయితే హీరో ఎవరు అని ఆలోచిస్తున్నారా? అదే మురుగదాస్ చేయబోతున్న మ్యాజిక్ అది.. తెలుగులో రూపొందించబోయే వెర్షన్‌లో విజయ్ విలన్‌గా నటిస్తారట. ఇక తమిళ వెర్షన్‌లో మహేశ్ విలన్‌గా కనిపిస్తారట. ఈ ప్రయోగం సక్సెస్ అవుతుందా అనే మాట పక్కన పెడితే.. కాన్సెప్ట్ మాత్రం కొత్తగానే కనిపిస్తున్నది. ఆయా భాషలో అగ్రనటులకు ఉన్న ఇమేజ్‌ను ద ృష్టిలో పెట్టుకొని ఈ చిత్రాన్ని చాలా జాగ్రత్తగా రూపొందిస్తున్నట్టు సమాచారం. తెలుగులో మహేశ్, తమిళంలో విజయ్ విలన్ అంటే ఒప్పుకోరు. కాబట్టి తెలుగులో విలన్‌గా విజయ్‌ను... తమిళంలో విలన్‌గా మహేశ్ పాత్రలను డిజైన్ చేస్తున్నాడు డైరెక్టర్ మురుగదాస్.

## కొత్త లుక్‌తో రామ్..

*ఎన్ని ఎత్తుపల్లాలు వచ్చినా జిందగీ మొత్తం మనతో ఉండేవాడే నిజమైన స్నేహితుడని నమ్మే యువకుడు అభిరామ్. నలుగురు స్నేహితులతో కలసి రాక్‌బ్యాండ్‌ను స్టార్ట్ చేస్తాడు. ఆ రాక్‌బ్యాండ్‌కి అతనే లీడర్. చిన్నప్పట్నుంచి హ్యాపీగా వెళ్తోన్న అభిరామ్ లైఫ్‌లోకి ఇద్దరమ్మాయిలు వస్తారు. వాళ్లలో ఎవరితో అభిరామ్ ప్రేమలో పడ్డాడు? అభిరామ్ జిందగీలో స్నేహితులు ఎలాంటి పాత్ర పోషించారు? అసలు, అభిరామ్ కథేంటి? అనేది ఈ నెల (అక్టోబర్) 27న చూపిస్తామంటున్నారు దర్శకుడు కిశోర్ తిరుమల. యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఉన్నది ఒకటే జిందగీ'. అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి హీరోయిన్లు.*




## సెట్స్ మీదే గొడవపడ్డారట

సాయి పల్లవి ఫిదా చిత్రంతో.. ఈ కేరళ కుట్టి స్టార్ డమ్ ఒక్కసారిగా తిరిగిపోయింది. తెలంగాణ యాస, భాష, సంస్క ృతీ సాంప్రదాయాల ఇతివ ృత్తంలో శేఖర్ కమ్ముల తీసిన ఎక్స్ పర్మెంట్ కు ప్రాణం పోసింది. అందుకే ఇప్పుడు ఆమె రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. అయితే వచ్చిన ప్రతి ఆఫర్ ని ఓకే చెయ్యకుండా, కదలని ఎంచుకోవడంలో ఆచి తూచి వ్యవహరిస్తోంది. అయితే ఆమెను సినిమాలకి ఒప్పించడం కేవలం దిల్ రాజు కే సాధ్యం అని చెప్పుకుంటున్నారు. ఆయన నిర్మిస్తున్న సినిమాలో హీరో నాని సరసన సాయి పల్లవి నటించడానికి కారణం కూడా దిల్ రాజు ప్రయత్నమే అని టాక్. అయితే ఇంత కష్టపడి సాయి పల్లవిని ఒప్పిస్తే ఇప్పుడు లేని చిక్కులు వచ్చినట్టు కనిపిస్తోంది. డిసెంబర్‌లో రిలీజ్‌కు రెడీ అవుతోన్న ఈ సినిమా షూటింగ్ అంతా కూల్‌గా జరుగుతోంది అనుకుంటున్న టైంలో హీరో, హీరోయిన్ల మధ్య చిన్న వివాదం ఇప్పుడు పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. ఓ సీన్ షూట్ చేస్తోన్న టైంలో హీరో నాని, హీరోయిన్ సాయి పల్లవి మధ్య జరిగిన చిన్న వివాదం కాస్త పెద్దదయ్యి హీరో నాని షూటింగ్ స్పాట్ నుంచి వెళ్లిపోయే వరకు వచ్చినట్టు ఇండస్ట్రీలో టాక్ వినపడుతోంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా బయటకు వచ్చినా, ఎందుకు జరిగింది? అన్న విషయంలో మాత్రం ఇంత వరకూ క్లారిటీ లేదు. ఇద్దరూ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! సినిమాలో డైలాగులకు సంబంధించి నాని



సాయి పల్లవికి ఏదో సలహా ఇవ్వబోయాడట! దాంతో ఇద్దరి మధ్యా చిన్నపాటి గొడవ జరిగిందట. ఇదంతా పాత సంగతే అయితే బయటకి మాత్రం కాస్త ఆలస్యంగా తెలిసింది. దిల్ రాజు ఈ ఇద్దరినీ కలపాలని చూసినా ఇద్దరూ కలవకుండా షూటింగ్ ఏదోలా పూర్తి చేసేసి ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా వెళ్ళిపోతున్నారట. ఇలా అయితే ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీకూడా దెబ్బతింటుందని యూనిత్ సభ్యులు ఆందోళన పడుతున్నారట.

# గీతం దంత ఆసుపత్రిలో ఉచిత నోటి కేన్సర్ పరీక్షలు

సాగర్‌నగర్: ఇటీవలి కాలంలో మారుతున్న ఆహార అలవాట్ల కారణంగా పెరుగుతున్న నోటి కేన్సర్ పై ప్రజలలో అవగాహన కలిగించటంతో పాటు నోటి కేన్సర్‌కు సంబంధించిన ప్రాధమిక పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధరప్రసాద్ తెలిపారు. ఈ నెల 3వ వారంలో నిర్వహించే ఈ ఉచిత నోటి కేన్సర్ పరీక్షా శిబిరంలో గుట్కా, పాన్ మసాలా, మధ్యపానం, పొగాకు, తంబాకు, అడ్డపొగాకు వంటి అలవాట్ల కలిగిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చునని సూచించారు. అలాగే పై అలవాట్ల కారణంగా నోటిలో దీర్ఘకాలిక తెల్లని లేదా ఎర్రని మచ్చలు, నోటి మంట లక్షణాలు కలిగిన వారు నాలుక మొద్దుబారటం, నోరు తెరవడంలో ఇబ్బందులు పడటం, దవడ క్రింద గ్రంధులు గట్టి పడటం, నోటిలో మొదట చిన్న వాపు వచ్చి క్రమేపి పెరుగుతూ అకస్మాత్తుగా నొప్పి కలిగించటం వస్తుంటి లక్షణాలను గుర్తించినట్లయితే ముందు జాగ్రత్తగా నోటి కేన్సర్ పరీక్షలకు హాజరు కావచ్చునని సూచించారు. నోటి కేన్సర్ నిర్ధారణ పరీక్షలను గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రిలోని ఓరల్ మెడిసిన్ మరియు రేడియాలజీ విభాగం లలో గల అనుభవజ్ఞులైన వైద్యులు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరు కాగోరే వారు గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రిని సంప్రదించాల్సిందిగా సూచించారు.



విశాఖ పోర్టు ట్రస్ట్‌లో స్వచ్ఛ భారత్ అభియాన్ పక్షోత్సవం ప్రధాని పిలుపు మేరకు 15 రోజుల పాటు నిర్వహించారు. ఇందులో భాగంగా పోర్టు ప్రాంతంలో మొక్కలు నాటడం, పోర్టు పరిసరాలు పారిశుద్ధ్యం వంటి వాటిపై దృష్టి సారించారు. ఈ ఉత్సవాలలో విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు, సహా పలువురు పోర్టు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చురుకుగా పాలు పంచుకున్నారు.

# అది బెయిల్‌పై నడుస్తున్న ప్రభుత్వం..!

## హిమాచల్ సీఎంపై ప్రధాని మోదీ విసుర్లు



న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్‌పై ప్రధాని నరేంద్రమోదీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఇది బెయిల్‌పై నడుస్తున్న ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. బిలాస్‌పూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును వీరభద్ర సింగ్ ఎదుర్కొంటున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలుచేశారు.

ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎయిమ్స్ వల్ల ఒనగూరే ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. హిమాచల్‌ప్రదేశ్‌కు పెద్దఎత్తున పర్యటకులు వస్తుంటారని, అలా వచ్చిన వారు ఇక్కడి ఎయిమ్స్ సేవలు పొందితే మళ్లీ మళ్లీ వస్తారని చెప్పారు. తాము ఏర్పాటు చేయబోయే క్యాంపస్ వల్ల ఉపాధి అవకాశాలు కూడా వస్తాయని పేర్కొన్నారు.

750 పడకలతో ఏర్పాటు చేయబోయే ఆస్పత్రి హిమాచల్ ప్రజలకు జీవనాడి వంటిదని పేర్కొన్నారు. వైద్య విద్య కూడా అందించబోతున్నట్లు చెప్పారు. దీంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ.15వేల కోట్లను కేంద్రం వెచ్చించనుందని తెలిపారు. బిలాస్‌పూర్ ఎయిమ్స్‌తో పాటు, ఉనాలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి మోదీ నేడు శంకుస్థాపన చేశారు. కాంగ్రాలో సెయిల్ ఉక్కు ఉత్పత్తి యూనిట్‌ను మోదీ ప్రారంభించనున్నారు.


# ఇంగ్లాండ్ 1.. భారత్ 4



దుబాయ్: ఐసీసీ తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వన్డే ప్రపంచకప్ విజేత ఇంగ్లాండ్ 3 పాయింట్లు సాధించి 128 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ టోర్నీలో సెమీస్‌లో భారత్ చేతిలో పరాజయం పాలైన ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని కోల్పోయింది. పాయింట్లలో ఎలాంటి మార్పులేకపోవడంతో 128 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరుకున్న భారత జట్టుకు 3 పాయింట్లు కలిసినా ర్యాంకు స్థానంలో ఎలాంటి మార్పు లేదు. 118 పాయింట్లతో నాలుగో స్థానంలోనే కొనసాగుతోంది.

ఈ సందర్భంగా మిథాలీ రాజ్ మాట్లాడుతూ.. మూడో స్థానంలో ఉన్న న్యూజిలాండ్(118)కి మాకు మధ్య రెండు పాయింట్ల వ్యత్యాసం మాత్రమే ఉంది. ఇక మా లక్ష్యం మూడు స్థానంపైనే. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్నాం. వన్డే, టీ20 సిరీస్‌ల్లో జట్టు మెరుగైన ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నా అని తెలిపారు.

# లండన్‌లో విజయ్ మాల్యా అరెస్ట్



లండన్: ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యాను లండన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మనీలాండరింగ్ కేసులో మాల్యాను అరెస్టు చేసినట్లు సమాచారం. భారత్‌లోని బ్యాంకులకు దాదాపు రూ.9వేల కోట్లను ఎగవేసిన మాల్యా లండన్ వెళ్లి తలదాచుకుంటున్నాడు. అతడిని అప్పగించమని భారత ప్రభుత్వం బ్రిటన్‌ను కోరింది. అందుకు అంగీకరించిన బ్రిటన్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ కేసులో మాల్యాను లండన్ పోలీసులు అరెస్టు చేయడం ఇది రెండో సారి.

ఏప్రిల్ నెలలో మాల్యాను లండన్ పోలీసులు అరెస్టు చేశారు. కానీ కొద్ది సేపటికే అతడు బెయిల్‌పై విడుదలయ్యాడు. వేల కోట్ల రూపాయలను బ్యాంకులకు ఎగ్గొట్టి మార్చి 2016 నుంచి మాల్యా బ్రిటన్‌లో ఉంటున్నాడు. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా విచారణకు హాజరుకావాల్సిందిగా పలుమార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టరేట్, సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# దేశ జిడిపిపై విద్యుత్ ఉత్పాదన ప్రభావం

## గీతంలో జిఇ పవర్ సీనియర్ ఇంజనీర్ డాక్టర్ సురేష్

సాగర్‌నగర్: దేశ స్థూల జాతీయోత్పత్తి ఆశించిన మేర పెరగకపోవడానికి గల కారణాలలో డిమాండ్‌కు తగ్గ విద్యుత్ ఉత్పాదన జరగకపోవడం ఒకటని సుప్రసిద్ధ సంస్థ జిఇ పవర్ సీనియర్ ఇంజనీర్ డాక్టర్ సురేష్ పేర్కొన్నారు.

గీతం విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన దేశంలో విద్యుత్ ఉత్పాదన రంగం-సవాళ్లు అనే అంశం పై ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చితే భారతదేశంలో అతి తక్కువ విద్యుత్ ఉత్పాదన జరుగుతోందని ముఖ్యంగా నేటికి దేశంలో 365 గిగావాట్ల విద్యుత్ ఉత్పాదన మాత్రమే జరగుతుండటంతో అందరికి విద్యుత్ అన్న నినాదం వెనకబడుతోందన్నారు.

ఈ పరిస్థితులలో మార్పు రావాలంటే సంప్రదాయేతర ఇంధన వనరులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను తక్కువ ధరకే ప్రజలకు అందించినప్పుడే జిడిపి ఆశించిన మేర వృద్ధి చెందుతుందన్నారు.

దేశంలో తొలసారిగా విద్యుత్‌ను పెద్ద ఎత్తున నిల్వ చేయడానికి కంప్రెస్డ్ ఎయిర్ ఎనర్జీ స్టోరేజ్ మరియు లిక్విఫైడ్ ఎయిర్ ఎనర్జీ స్టోరేజ్ పేరిట నూతన పరిజ్ఞానాన్ని తమ సంస్థ అభివృద్ధి చేస్తోందని దీని ద్వారా మెగావాట్ల విద్యుత్‌ను సహితం నిల్వ చేసుకుని అవసరమైనప్పుడే వినియోగించవచ్చు నన్నారు.

ఈ సందర్భంగా ఆయన విద్యుత్ ఉత్పాదన, పంపిణీ రంగంలో పెరగనున్న ఉద్యోగ అవకాశాలను వివరించారు.

కార్యక్రమానికి గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికి భవిష్యత్తులో అవకాశాలు విస్త ృతంగా లభిస్తాయని అయితే వారు వృత్తి నిపుణతను పెంచుకోవడం, నూతన పరిజ్ఞానం పై దృష్టి సారించటం చేయాలని సూచించారు.

గీతం ఇఇఇ విభాగం అధిపతి జి.వి.కె.ఆర్.శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్ఆర్ఎస్ సత్యన్నారాయణ, కె.శ్రీచందన్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో రాహుల్ 'టెంపుల్ రన్'



గాంధీనగర్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది.

సౌరాష్ట్రలో సాగిన మూడు రోజుల పర్యటనల్లో హిందువులను ఆకట్టుకునేందుకు దేవాలయాలను సందర్శించిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మలివిడత టూర్‌లోనూ 'టెంపుల్ రన్' కొనసాగించనున్నారు. ఈనెల 9నుంచి 11 వరకూ మూడు రోజుల పాటు సాగే రెండో విడత పర్యటనలో భాగంగా రాహుల్ నడియాద్‌లోని శాంత్‌రామ్ దేవాలయాన్ని, ఫగ్వెల్‌లో కొలువైన భత్జీ మహరాజ్ ఆలయాన్ని, పావ్‌గఢ్‌లో మాకాళీ టెంపుల్‌ను, ఖేదా జిల్లాలో దకోర్ ఆలయాన్ని దర్శించుకోనున్నారు. టూర్‌లో భాగంగా వదోదర, బొదేలీలో రెండు రోడ్‌షోలు నిర్వహించనున్నారు. 18 చిన్నపాటి సభలు, నాలుగు సంవాద్ సమావేశాల్లో పాల్గొనడంతో పాటు రైతులు, వ్యాపారులు, కార్మిక సంఘాల నేతలతో సమావేశమవుతారు.

పార్టీపై మైనారిటీలకు అను కూల మన్న ముద్రను తొలగించుకునేందుకు, హిందువులను ఆకట్టుకునేందుకే ఆయన ఆలయాల బాట పట్టారని భావిస్తున్నారు.

మైనారిటీలను దూరం చేసుకోకుండానే హిందువుల ఓట్లకు గాలం వేస్తూ ఓటు బ్యాంక్‌ను విస్త ృతం చేసుకోవాలన్నది రాహుల్ ఆలోచనగా చెబుతున్నారు.

ఇక దీపావళి తర్వాత రాహుల్ ఉత్తర గుజరాత్ యాత్రను చేపట్టి అంబాజీ, బెచరజి, ఉంజా తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారు.

# అధికారులు ప్రజలకు ఉత్తమ, సత్వర సేవలందించడం లక్ష్యంగా పనిచేయాలి

## జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జివియంసి అధికారులు ప్రజలకు ఉత్తమ, సత్వర సేవలందించడం లక్ష్యంగా పనిచేయాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో అందరు విభాగాధిపతులు, ఇంజనీర్లు, పట్టణ ప్రణాళిక, యుసిడి, యుజిడి, ప్రజారోగ్యం, రెవెన్యూ, జోనల్ కమిషనర్లతో మంగళవారం పవర్ పాయిమట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు విభాగాల వారిగా నిర్వర్తించవలసిన కార్యక్రమాలు, లక్ష్యాల గురించి కూలంకషంగా వివరించారు. సాధారణ పరిపాలన, యుసిడి, ఎడ్యుకేషన్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, రెవెన్యూ, ఇంజనీరింగ్ లో పనులు, ప్రాజెక్టులు, వాటర్ సప్లయి, మెకానికల్ యుజడి, హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గ్రీవెన్స్‌ను అంశాలవారీగా వివరించి లక్ష్యాలను నిర్దేశించారు. జివియంసి సేవల గురించి, కార్యక్రమాలను ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించి పూర్తి చేయడం ద్వారా అధికారులు సమర్ధతను నిరూపించుకోవాలని పేర్కొన్నారు. ఆరు నెలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అభిలషించారు.

అదనపు కమిషనర్లు జివివియస్ మూర్తి,, యస్.యస్ వర్మ, వి.రవీంద్ర, చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, చీఫ్ సిటీప్లానర్ విద్యుల్లత, డి.ఇ.ఓ లక్ష్మీనరస, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, యస్.ఇలు ఆనందరావు, వినయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, అందరు కార్యనిర్వాహక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లు, ఏసిపిలు, ఏ.యం.ఓ.హెచ్‌లు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



# గీతం టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక

సాగర్‌నగర్: ఈ నెల 4 నుంచి 6వ తేది వరకు కోయంబత్తూర్ లో జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ (పురుషుల) పోటీలో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.

జట్టు కెప్టెన్‌గా కె.ఎస్.శ్రీహరి వ్యవహరిస్తారని సభ్యులుగా ఆర్.కౌశాల్ అనురాగ్, గేరి శామ్యూల్, నాజర్ గుల్‌రిజ్ సలేహ్, బి.వి.డి.వర్ధన్‌కుమార్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జట్టు మేనేజర్‌గా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహాయ డైరక్టర్ జి.శ్రీనివాస్ వ్యవహరిస్తారని తెలిపారు. గీతం జట్టు తన మొదటి మ్యాచ్‌లో బెంగళూరు క్రిస్ట్ విశ్వవిద్యాలయం పై తలపడుతుందని పేర్కొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com